విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

గురువారం 09 జనవరి 2025 8 పేజీలు

ఉత్సాహభరితంగా ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా 21వ మహాసభలు గుంటూరులో బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ సభలకు వైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర, ఉపాధ్యక్షులు షేక్ సుభానిలతో పాటు మాజీ రాష్ట్ర కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన ప్రదర్శనలో యువత పెద్దసంఖ్యలో పాల్గొని 'అప్ అప్ సోషలిజం... డౌన్ డౌన్ క్యాపిటలిజం' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

పందేలకు బరులు రెడీ!

-జక్కంపూడి, అంబాపురం, కె.తాడేపల్లి, రామవరప్పాడులో శరవేగంగా బరులు

-హెచ్చరికలు పట్టించుకోని నిర్వాహకులు... నేడు భూమి పూజలు

"హైకోర్టు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ స్పష్టమైన నిషేధాజ్ఞలు, ఆదేశాలు జారీ చేసినప్పటికీ విజయవాడ శివార్లలో రానున్న సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేల నిర్వహణకు సన్నాహాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. టీడీపీ పలుకుబడి ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధుల మద్దతుతో సంక్రాంతి సంబరాలు పేరుతో ఈ రక్త క్రీడకు రంగం సిద్ధం చేస్తున్నారు."

విశాలాంధ్ర-విజయవాడ క్రైమ్ : ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్, 1974లోని సెక్షన్ 10, జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం, 1960లోని సెక్షన్ 34 ప్రకారం నిషేధాన్ని నొక్కి చెబుతూ, రాష్ట్రంలో కోడి పందేలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. పోలీసు, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేశారు. నిషేధాన్ని అమలు చేయడానికి, ప్రజలకు అవగాహన కల్పించడానికి, ఆసక్తికరంగా, ఈ బృందాలు ఈ కోడి పందేల మైదానాల తయారీ పనులను తనిఖీ చేయకపోవడం మిగతా 2 లో ...

రేపు తహశీల్దార్లకు అర్జీలు అందజేద్దాం

జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందచేయాలని కోరుతూ ఈ నెల 10న సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద తలపెట్టిన అర్జీలు అందజేసే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో బుధవారం

గంజాయి పట్టివేత

విశాలాంధ్ర నందిగామ : నందిగామ డివిజన్ పరిధిలో రూ.25 లక్షల విలువ చేసే గంజాయి, రెండు కార్లును నందిగామ సబ్ డివిజన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో 200 కేజీలు గంజాయి, రెండు కార్లును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజయవాడ డీసీపీ మహేశ్వరరాజు మాట్లాడుతూ గంజాయి వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారని తెలిపారు. ఈ నెల 7వ తేదీన నందిగామ సబ్ డివిజన్ పోలీసులు రూ. 25 లక్షల విలువ చేసే 200 కేజీల గంజాయి మిగతా 2 లో ...

ముగిసిన రెవెన్యూ సదస్సులు

- 33 రోజులు 4,813 పిటిషన్లు..
- ఇప్పటికే 1,819 అర్జీల పరిష్కారం
- ప్రజల భూ హక్కు భరోసాకు శాశ్వత పరిష్కారం : కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.

విశాలాంధ్ర-విజయవాడ: భూ సమస్యలపై ప్రభుత్వం నిర్వహించిన రెవిన్యూ సదస్సులు ముగిశాయి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 33 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు జరిగాయి. జిల్లాలో జరిగిన సదస్సుల్లో మొత్తం దాదాపుగా మిగతా 2 లో ...

అభివృద్ధికి శ్రీకారం

కలెక్టర్ డీకె.బాలాజీ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : నియోజకవర్గ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. పరిస్థితులను సమీక్షించారు. నియోజకవర్గం అభివృద్ధిలో బాగంగా మంగినపూడి బీచ్ ను పర్యాటక కేంద్రంగా మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

రేపు తహశీల్దార్లకు అర్జీలు అందజేద్దాం

ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇచ్చి, ఇల్లు కట్టుకోవడానికి రూ.4 లక్షలు ఆర్థిక సాయం చేస్తానని చెప్పారని, పెరిగిన ధరల రీత్యా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ నెల 10న లబ్ధిదారులను సమీకరించి తాలూకా కార్యాలయాల వద్ద అర్జీలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ఇల్లు లేని నిరుపేదలంతా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పందేలకు బరులు రెడీ!

గమనార్హం. ఇన్ని చర్యలు తీసుకున్నా జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి, రామవరప్పాడు, అంబాపురం తదితర ప్రాంతాల్లో కోడిపందాల నిర్వాహకులు, టీడీపీనేతలతో సంబంధమున్న పలువురు సన్నాహాలు వేగవంతం చేశారు. పెద్దఎత్తున వేదికలు ఏర్పాటు చేస్తూ, పందేలలో పాల్గొనేవారిని పందెపురాయుళ్లను ఆకర్షించడానికి ఎమ్మెల్యేల ఛాయాచిత్రాలను కలిగి ఉన్న బ్యానర్లు ,హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. రామవరప్పాడు సమీపంలో, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత నివాసానికి సమీపంలో ఒక ప్రధాన వేదికను ఏర్పాటు చేయడం, పోలీసులు, జిల్లా అధికార యంత్రాంగం లోపాలను ఎత్తి చూపుతోంది. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో బృందాలను ఏర్పాటు చేసినా చెప్పుకోదగ్గ తనిఖీలేవీ జరగకపోవడం, సన్నాహకాల గురించి చాలా మంది అధికారులకు తెలియడం లేదు. సైపుల రోడ్డు సమీపంలోని అంబాపురం, కొత్తూరు తాడేపల్లి వంటి ప్రాంతాలు స్థానిక నాయకుల పర్యవేక్షణలో పెద్ద ఎత్తున మైదానాన్ని సిద్ధం చేశాయి, చట్టం అమలు చేసే వారి జోక్యం అంతగా లేకపోవడం గమనార్హం. నిర్వాహకులు గ్రౌండ్ లెవలింగ్ పనులను పూర్తి చేయగా, కోడి పందాలను తిలకించేందుకు గ్యాలరీలను నిర్మించే పనులను ప్రారంభించారు. ఇదిలావుండగా, కోడిపందాలు నిర్వహించేందుకు అవసరమైన తదుపరి పనులను ప్రారంభించేందుకు అంబాపురం బరి నిర్వాహకులు గురువారం ప్రత్యేక పూజలు చేసేందుకు సిద్ధమయ్యారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

4,813 అర్జీలు రాగా ఇప్పటికే 1,819 అర్జీలను పరిష్కరించారు. మిగిలిన అర్జీలు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జి లక్ష్మీశ స్పష్టం చేశారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద చివరి రోజు జరిగిన గూడూరుపాడు రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) స్టాల్ కార్యకలాపాలను పరిశీలించారు. అదేవిధంగా ప్రభుత్వ భూముల రిజిస్టర్, రెవెన్యూ సదస్సుల మినిట్స్ రిజిస్టర్, ఎండోమెంట్ భూములు, అసైన్‌మెంట్ భూములు తదితర వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత డిసెంబర్ 6న రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయని.. బుధవారం వరకు షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సమాచారమిస్తూ సదస్సులు నిర్వహించినట్లు వివరించారు. మంచినీటి అవసరాలకోసం ఉప్పునీటిని మంచినీరుగా మార్చే డీ-సాలినేషన్ ప్లాంట్ ఏర్పాటుకు అవకాశాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకొనుటకు వాటి నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో బందరు ఆర్డీఓ కె. స్వాతి, డ్వామా పిడి కె.వి. శివప్రసాద్ యాదవ్, జిల్లా టూరిజం అధికారి రామలక్ష్మణ్, పరిశ్రమల శాఖ జీఎం. ఆర్. వెంకట్రావు, సర్వే ఏడీ. జోషిలా, జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి ఝాన్సీ, జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ అధికారి నరేష్, తహసీల్దార్ మధుసూధన రావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు కీసర టోల్‌ప్లాజా వద్ద, గట్టు భీమవరం టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ఒక వాహనం కీసర టోల్ ప్లాజా వద్ద తప్పించుకొని హైదరాబాద్ వైపు వెళ్తుండగా డ్రోన్ కెమెరా సాయంతో గట్టు భీమవరం వద్ద అడ్డగించేందుకు ప్రయత్నించగా కారును యూటర్న్ తీసుకుని నిందితులు గౌరవరం వద్ద పోలాలలో వదిలి పరారయ్యారు. అనంతరం కారును తనిఖీ చేయగా కారులో 80 కేజీల గంజాయి దొరికినట్లు తెలిపారు. అయితే రెండవ కారు కీసర టోల్ ప్లాజా దాటిన తరువాత నందిగామ పరిసర ప్రాంతాలలో కనిపించకుండా పోయిందని, దీనిని హైవే పై ఉన్న సిసి కెమెరాలు, డ్రోన్‌ల సాయంతో అంబారుపేట దగ్గర రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఉన్నట్లు తెలుసుకుని అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నందిగామ ఏసీపీ ఎబిజీ తిలక్, నందిగామ పట్టణ సిఐ వైవీఎల్ నాయుడు, నందిగామ ఎంఆర్ఓ సురేష్ బాబుతో వెళ్లి పరిశీలించగా కారులో సుమారు 120 కేజీల గంజాయి దొరికినట్లు తెలిపారు. అయితే రెండుకార్లల్లో ఉన్న నిందితులు పరారీ అయినట్లు తెలిపారు. ఇప్పటికే నిందితులను పట్టుకునేందుకు నాలుగు టీంలను ఏర్పాటు చేసినట్లు డీసీపీ తెలిపారు. ఈ సమావేశంలో నందిగామ సిఐ నాయుడు, రూరల్ సిఐ చవాన్, జగ్గయ్యపేట సిఐ వెంకటేశ్వర్‌రావు, చందర్లపాడు ఎస్ఐ దుర్గ మహేశ్వరరావు, నందిగామ ఎస్ఐ అభిమన్యు, జగ్గయ్యపేట ఎస్ఐ వెంకటేశ్వర్‌రావు, చిల్లకల్లు, వత్సవాయి, పెనుగంచిప్రోలు ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

నరెడ్కో కాపిటల్ జోన్ మెగా ప్రాపర్టీ షోకు ఏర్పాట్లు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నరెడ్కో కాపిటల్ జోన్ వారు ఈ నెల 10, 11, 12 తేదీలలో గుంటూరు చేబ్రోలు హనుమయ్య ప్రాంగణంలో నిర్వహించే 12వ మెగా ప్రాపర్టీ షోకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం ప్రాపర్టీ షో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిర్వాహకులు మాట్లాడారు. ఈ మెగా ప్రాపర్టీ షో గుంటూరు ప్రాంతంలో రియల్ ఎస్టేట్ పరిశ్రమకు మరింత ప్రోత్సాహం అందించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ ప్రాపర్టీ షోలో 150 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వీటిలో బిల్డర్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, జాతీయ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, బిల్డింగ్ మెటీరియల్ సప్లయర్స్ పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ ప్రాపర్టీ షోకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా మంత్రులు నారాయణ, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, నరెడ్కో చైర్మన్ హీరానందని, నేషనల్ ప్రెసిడెంట్ గడ్డిపాటి హరిబాబు, స్టేట్ ప్రెసిడెంట్ చక్రధర్ తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ గద్దె తిరుపతిరావు, నరెడ్కో రాష్ట్ర కార్యదర్శి మామిడి సీతారామయ్య, నరెడ్కో కాపిటల్ జోన్ ప్రెసిడెంట్ పెరవలి నాగ వంశీ, నరెడ్కో కాపిటల్ జోన్ సెక్రటరీ వి.శ్రీనాథ్, మధుసూదనరెడ్డి, శ్రీనివాస్ కుమార్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కిడ్స్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-మాచర్ల: స్థానిక కిడ్స్ పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కెసిపి జీఎం వెంకటరమణ, హెచ్ఆర్ మేనేజర్ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయాన్ని భావితరాలకు అందించేందుకు అందరం కృషి చేయాలన్నారు. వేడుకల్లో మహిళా నాయకులు సుశీల, ఎఫ్.వి.వి.ఎస్ శాస్త్రి, వెల్ఫేర్ అధికారి శ్రీనివాసరావు, ఏవో విజయ శేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

జువాలజీ విభాగంలో టాక్సికాలజీ పై జాతీయ సదస్సు

విశాలాంధ్ర-మంగళగిరి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల యుజిసి జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్, విభాగాధిపతి ఆచార్య వి.వెంకటరత్నమ్మ తెలిపారు. లిరీసెంట్ అడ్వాన్ సెస్ ఇన్ టాక్సికాలజీ, ఇమ్యూనాలజీ అండ్ బయోడైవర్సిటీలో అనే అంశంపై ఈనెల 29, 30 తేదీలలో సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సదస్సు బ్రోచర్ ను బుధవారం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే గంగాధర రావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు ఆవిష్కరించారు. వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ సదస్సు ఫలవంతంగా జరగాలని ఆకాంక్షించారు. ఈనెల 25వ తేదీలోగా ఆసక్తి ఉన్న పరిశోధకులు, అధ్యాపకులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు తమ పరిశోధన పత్రాలను సమర్పించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఈ సందర్భంలో విభాగం అధ్యాపకులు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కే. వీరయ్య, ఆచార్య సునీత, ఆచార్య వీవీ కృష్ణ, ఆచార్య జగదీష్ నాయక్, ఆచార్య పద్మావతి పరిశోధకులు పాల్గొన్నారు.

త్వరలో శంకర్‌విలాస్ ఫ్లైవర్ పనులు : పెమ్మసాని

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఎన్నికల ముందు గుంటూరులో ఉన్న సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చామని వాటన్నింటినీ ఇప్పుడు నెరవేరుస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శంకర్ విలాస్ ఫ్లైవర్ పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. రూ.107 కోట్ల గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు రైల్వే బ్రిడ్జికి రైల్వే బోర్డు అనుమతులు ఇచ్చిందని పెమ్మసాని తెలిపారు. సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఇన్నర్ రింగు రోడ్డు ఆర్వోబికి రైల్వే శాఖ పచ్చజెండా

గుంటూరు ఇన్నర్ రింగు రోడ్డు ఆర్వోబీకి రైల్వే శాఖ పచ్చజెండా ఊపింది. గడ్డిపాడు వద్ద పైవంతెన కోసం రూ.107.79 కోట్లు మంజూరు చేసింది. నాలుగు వరుసల్లో ఆర్వోబి నిర్మాణానికి రైల్వే శాఖ అనుమతి ఇచ్చింది. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో రింగు రోడ్డు పైవంతెన సాకారం కానుంది. రింగు రోడ్డు మీదుగా విజయవాడ హైవేకు వెళ్లే వారికి ఊరట లభించనుంది.

ఇండస్‌ఫుడ్-2025లో 'తెనాలి డబుల్ హార్స్ గ్రూప్'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గ్రామీణ ఆహార పదార్థాలను ప్రపంచానికి పరిచయం చేయడంలో ఇండస్‌ఫుడ్ ఎక్స్‌పో కీలక పాత్ర పోషిస్తుందని తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. బుధవారం ఢిల్లీలో ఇండియా ఎక్స్‌పోజిషన్ మార్ట్‌లో జరిగిన 'ఇండస్‌ఫుడ్-2025 ప్రీమియం వంట సామాగ్రి సంబంధించిన ఎక్స్‌పో జరిగింది. ఈ సందర్భంగా మోహన్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ వంట సామాగ్రి ఉత్పత్తుల్లో అగ్రగామి తెనాలి డబుల్ హార్స్ గ్రూపు ఈ ఎక్స్‌పోలో పాల్గొంది. ఈ నెల 10వ తేదీ వరకు ఈ ఎక్స్‌పో జరగనుందని, 20 దేశాల నుంచి ఆహార ప్రాసెసింగ్ సంస్థలు, 1,800 పైగా ప్రదర్శకులు, 5వేలకు పైగా అంతర్జాతీయ కొనుగోలుదారులు పాల్గొంటున్నట్లు ఆయన వెల్లడించారు. మన గ్రామీణ ఆహార సంస్కృతి గొప్పతనాన్ని, సంప్రదాయాలను ముందుకు తీసుకువెళ్ళే అవకాశాన్ని ఇండస్‌ఫుడ్ అందిస్తుందని, ఇది మన గ్రామీణ వైద్యాన్ని గ్లోబల్ మార్కెట్లకు తీసుకువెళ్ళే ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. గత రెండేళ్లుగా ఇండస్‌ఫుడ్‌లో పాల్గొంటున్నామని, ఆరోగ్యంపై మక్కువ కలిగిన వినియోగదారులు, భోజనప్రియులను ఆకట్టుకునే ఉత్పత్తులను ఈ అంతర్జాతీయ వేదిక ద్వారా ప్రదర్శించామని చెప్పారు. గ్రామీణ ఆహారాన్ని, పోషక విలువను అంతర్జాతీయ భోజనాల్లోకి తీసుకురావడమే మా లక్ష్యమని తెలిపారు.

యువతి అనుమానాస్పదంగా మృతి

విశాలాంధ్ర-విజయపురిసౌత్: యువతి అనుమానస్పదంగా మృతి చెందిన సంఘటన మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మాచర్ల మండలం విజయపురిసౌత్ కు చెందిన బత్తుల కల్పన (28) ఉరి వేసుకుందంటూ భర్త సురేష్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. వైద్యులు పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు భర్త సురేష్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు : ఎస్ఐ సురేష్

విశాలాంధ్ర-నకరికల్లు: మండల పరిధిలో ఎవరైనా కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు చేపడతామని నకరికల్లు ఎస్ఐ సురేష్ బాబు అన్నారు. ఇప్పటికే పలువురిని బైండ్ ఓవర్ చేసామని, సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు నిర్వహించే వారిపై నిఘా ఏర్పాటు చేశామని అన్నారు. మండల పరిధిలో ఎక్కడ కోడి పందాలు జరిగిన తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

41 కందుల కొనుగోలు కేంద్రాలు : జేసీ

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లాలో 41 కంది కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు, క్వింటాలు కందులు ఎంఎస్ పి ధర రూ.7,550 లకు మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నామని జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే అన్నారు. కంది పంట సాగు చేసిన రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కందులు కొనుగోలు కోసం సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 12908 హెక్టార్లలో రైతులు కంది సాగు చేశారని సుమారు 50, 879 క్వింటాళ్ళ కందులు దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఆయన అన్నారు. జిల్లా వ్యాప్తంగా 28 మండలాల్లో ఉన్న 387 రైతు సేవా కేంద్రాల్లో రైతులు ఈ క్రాఫ్ట్ నమోదు చేసుకొని కందులను సంబంధిత కేంద్రాల్లో అమ్మకాలు చేపట్టాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన కందులను సత్తెనపల్లిలోని సిడబ్ల్యుసి కేంద్రానికి తరలిస్తామన్నారు. రైతులు గురువారం నుండి తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మాధవి శ్రీకారం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నిర్లక్ష్యానికి గురైన డివిజన్లలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభివృద్ధి బాటలు వేస్తున్నారు. అభివృద్ధికి నోచుకోని శివారు ప్రాంతాలపై దృష్టి పెట్టి కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మాధవి శ్రీకారం చుట్టారు. బుధవారం 21వ డివిజన్‌లో రూ.1 కోటి 91 లక్షల 40వేల రూపాయల భారీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో చిన్న మస్తాన్ వలి, చెన్నంశెట్టి శ్రీకాంత్, కంచర్ల సాంబశివరావు,కదిరి సంజయ్,ఆళ్ల హరి,విజయ లక్ష్మి, బాబు ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **CHANDRAIAH KONDAPALLI** (Old Name), S/o. **KONDAPALLI SESHAGIRI RAO**, Resident of Door No:2-47B, Kummari Bazar, Thummalapalem Village, Prathipadu Mandal, Guntur District - 522019, Andhra Pradesh. I have changed my name from **CHANDRAIAH KONDAPALLI** to **KONDAPALLI PURNACHANDU** (New Name - as per Numerology). Hereafter I will be called as **KONDAPALLI PURNACHANDU** (New Name - as per Numerology).

CHANGE OF NAME

I, **KURNALA GIRIDHAR KUMAR** (Old Name), S/o. **KURNALA VASUDEVA RAO**, Resident of Door No:5-51-17/1, Brodipet 5/16th Lane, Guntur, Guntur District - 522002, Andhra Pradesh. I have changed my name as **KURNALA GIRIDHAR** (New Name) S/o. **KURNALA VASUDEVA RAO**. Hereafter my name is known as **KURNALA GIRIDHAR** (New Name) S/o. **KURNALA VASUDEVA RAO.**

1400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

విశాలాంధ్ర-మాచర్ల: నిషేధిత నాటు సారా తయారీ, విక్రమాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని ఎక్సైజ్ సీఐ ఎన్. వెంకటరమణ హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ పిఎస్‌లో బుధవారం ఆమె విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సీఐ వెంకటరమణ మాట్లాడుతూ ముందస్తు సమాచారంతోనే వెల్దుర్తి మండలం గుడ్డపాడులో దాడులు నిర్వహించి నట్లు తెలిపారు. దాడుల్లో సుమారు 65 లీటర్ల నాటుసార, 1400లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. మాచర్ల, పరిసర ప్రాంతంలో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ అమ్ముతున్నట్లు సమాచారం ఉందని, వారిపై దృష్టి సారించి నిఘా పెట్టినట్లు ఆమె పేర్కొన్నారు.

దాచేపల్లిలో ఇద్దరు అదృశ్యం

విశాలాంధ్ర-దాచేపల్లి: మండలంలోని రెండు ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయ్యారు. గామాలపాడులోని భట్టు పరమేశ్వరరావు గత నెల 15 నుంచి కనిపించడంలేదు. 60 ఏళ్ల వయసు కలిగిన ఈ వృద్ధుడు ఆ రోజు ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. మళ్ళీ తిరిగి రాలేదు. ఇతను సమీపంలోని సిమెంటు కర్మాగారంలో పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. వ్యవసాయ పనులు చేస్తున్నారు. మూడు వారాల నుంచి కనిపించకపోవడంతో అతని కుమారుడు సువర్ణ కుమార్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా దాచేపల్లికి చెందిన ఓ వివాహిత మహిళ బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దాంతో ఆమె భర్త నరేష్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పాపారావు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మృతి

విశాలాంధ్ర-ఈపూరు : రోడ్డు ప్రమాదం లో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని దుస్సాపేట తండా వద్ద బుధవారం జరిగింది. బొల్లాపల్లి మండలంలం మూగచింతల పాలెం గ్రామానికి చెందిన కడియం బాలయ్య(45) పొలంలో చేసిన పనులకు సంబంధించి కూలి డబ్బుల కోసం దుస్సాపేట తండా వచ్చితిరిగి వెళ్తున్నాడు. బాలయ్య బైక్‌పై వెళు ండగా వినుకొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో బాలయ్య రోడ్డుపైన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

మండలంలో ధృవపత్రాల తనిఖీ

విశాలాంధ్ర-ఈపూరు : మండలంలోని వివిధ గ్రామాలలో దివ్యాంగుల విచారణ బుధవారం చేపట్టారు. ప్రత్యేక విచారణ బృందం ప్రతి లబ్దిదారుడి ఇంటికి వెళ్ళి ధృవపత్రాలను తనిఖీ చేశారు. దివ్యాంగులను పరిశీలించారు. మొత్తం 23 మంది నూరుశాతం దివ్యాంగత్వం ఉన్నవారిని పరిశీలించి ధృవపత్రాలను తనిఖీ చేశారు. బృందంలో వైద్యులు వరుణ్, రోశయ్య, నాగేంద్రబాబు, ఎంపీడీఓ కె.ప్రభాకరరావు, ఏపీఎం రంగారెడ్డి, సీసీలు ఉన్నారు.

న్యాయవాది ప్రకాశరావుపై అక్రమ కేసు ఎత్తివేయాలి

విశాలాంధ్ర-పొన్నూరు: పొన్నూరు పట్టణంలో న్యాయవాది బేతాళ ప్రకాశ రావుపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేసి అర్బన్ సీఐ రమేష్ బాబు, ప్రభుత్వ వైద్యుడు ఫిరోజ్ ఖాన్ పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పొన్నూరు బార్ కౌన్సిల్ సభ్యులు బుధవారం పొన్నూరు అంబేద్కర్ సెంటర్లో ఆందోళన చేపట్టారు. న్యాయవాదులపై దాడులను అరికట్టి ప్రత్యేక చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. ఆందోళన కార్యక్రమానికి ప్రజాసంఘాలు మద్దతు తెలిపారు.

కృష్ణా నదీ తీరాన పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర-దాచేపల్లి: కృష్ణా నదీ తీరానున్న పొందుగల, రామాపురం గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ పాపకుమారి అక్కడి పొలాల్లో మిర్చి తదితర పంటలను పరిశీలించారు. వాటిలో ఉన్న తెగుళ్ళ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

టీడీపీ కార్యకర్త కొండలు మృతి

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని 75 తాళ్లూరు గ్రామానికి చెందిన టీడీపీ బీసీ సెల్ నాయకులు బలుసుపాడు కొండలు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. స్థానిక టీడీపీ నేతలు ద్వారా సమాచారం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ ఫోన్ ద్వారా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అత్తిమల రమేష్, సీఏజ నియోజకవర్గ కార్యదర్శి మునుగోడు శ్రీనివాసరావు, దొడ్డ రాజు, చల్లపల్లి పానయ్య, క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బెల్లంకొండ రామ్‌గోపాల్ రావు, మాజీ ఎంపీపీ గల్లా బాబురావు, కలం సుందరామిరెడ్డి, కొల్లి బ్రహ్మారెడ్డి, జంగాల ప్రసాదు, సాగర్, నాగిని అమరా రెడ్డి, జనవరపు రామకోటిరెడ్డి, యన్నం శ్రీనివాస్ రెడ్డి, గుత్తికొండ చిన్న ఆంజనేయ రెడ్డి తదితరులు ఏడుకొండలు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు వారి కుటుంబాలకు అండగా ఉంటుందని అన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు

విశాలాంధ్ర-నరసరావుపేట: ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలను పంపిణీ చేసి, ఇంటి నిర్మాణాలకు రూ.5 లక్షల నిధులు మంజూరు చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం రాంబాబు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 10న తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం పేదలకి పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలాలు ఇస్తామని వాగ్దానాలు చేయడం జరిగిందని ఆ వాగ్దానాల్ని అమలు చేయాలని సీపీఐ డిమాండ్ చేస్తుందని అన్నారు. నరసరావుపేట రూరల్, రొంపిచర్ల, నకరికల్లు మండలాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చక్రవరం సత్యనారాయణ రాజు, సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి రోడ్డు అంజిరెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : ఇళ్ళు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం తాడేపల్లి ప్రకాష్ నగర్ సీపీఐ కార్యాలయం ముందు పేదల నుంచి సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లోని పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లోని పేదలకు మూడు సెంట్లు, ఇంటికి స్థలం కేటాయించి ఇళ్ళు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు షేక్ బాషా, ప్రసాద్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారి ఆదాయం రూ.12,66,245

విశాలాంధ్ర-దుగ్గిరాల : కంఠంరాజు కొండూరులోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. రెండో నెలల 20 రోజులకు రూ.12,66,245 విరాళాల రూపేనా వచ్చినట్లు తెలిపారు. విరాళాలు ఆలయ అభివృద్ధికి కేటాయిస్తామని చెప్పారు. లెక్కింపును దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ వెంకట శ్రీనివాసులు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి కె.సునీల్ కుమార్, ట్రస్టీ దేవాభక్తుని రంగ ప్రసాద్, ఆలయ అర్చకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మహిళలు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

డైరీని ఆవిష్కరించిన డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డిఎంహెచ్ఓ)డాక్టర్ కొర్ర విజయలక్ష్మి తన ఛాంబర్ నందు బుధవారం ఎంపీహెచ్ఈఓ, సీహెచ్ఓల డైరీని ఆవిష్కరిం చారు. డైరీ ఆవిష్కరణలో రాష్ట్ర శాఖ జనరల్ సెక్రటరీ కె.శేషగిరి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఆనందరావు, జిల్లా అధ్యక్షులు టి.సాంబయ్య, జిల్లా సెక్రటరీ ప్రసాదస్వామి, జిల్లా ట్రెజరర్ నూనె రామకృష్ణారావు, డిప్యూటీ డెమో ఎన్.వెంకటేశ్వర్లు, ఆఫీస్ బ్యానర్లు పున్నారెడ్డి, గణేష్, నరేంద్ర, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొచ్చర్ల, ఉప్పరపాలెంలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర-ఈపూరు : మండల పరిధిలోని కొచ్చర్ల, ఉప్పరపాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి రామినేడి రామారావు మొక్కజొన్న పంటను పరిశీలించి పంట యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. అనంతరం రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేయటం జరుగుతుందని రైతులకు తెలియజేశారు. అవకాశం ఉన్న ప్రతి రైతు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే రబీ సీజన్‌లో ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఆర్వోబీకి నిధులు : నిమ్మల

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు నగరంలోని ఇన్నర్‌రింగ్ రోడ్డు గడ్డిపాడు వద్ద నాలుగు వరుస లలో ఆర్వోబి నిర్మాణానికి రైల్వేశాఖ పచ్చజెండా ఊపుతూ రూ.107.79 కోట్లు నిధులు మంజూరు చేయడం శుభపరిణామం అని జనసేన పార్టీ నాయకులు, కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియా తో మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో గుంటూరు నగరం రూపురేఖలు శరవేగంగా అభివృద్ధి జరుగుతున్నాయన్నారు. ఈ వంతెన నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య తీరనుందని, రింగురోడ్డు మీదుగా విజయవాడ హైవే వెళ్లే వాహనదారులకి ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.

ట్రామా నోడల్ అధికారిగా నారాయణరావు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్)సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ ఆర్థోపెడిక్ విభాగం హెచ్ఓడీ వివి నారాయణరావును ట్రామా నోడల్ ఆఫీసర్‌గా (పర్యవేక్షణ అధికారి)నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నారాయణరావు ప్రతీ రోజూ క్యాసువా లిటికి వెళ్లి ట్రామా పని వ్యవస్థను పర్యవేక్షిస్తారు. అలాగే క్యాజువా లిటీకి వచ్చిన రోగులకు డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది నిర్దేశిత సమయా నికి సత్వర వైద్యం అందిస్తున్నారా ? లేదా ? సిబ్బంది సరిగా పని చేస్తున్నారా లేదా అనే విషయాలను ఈయన పర్యవేక్షిస్తారు. ట్రామాకి సంబంధించిన 51 మంది సిబ్బందికి శిక్షణ ఇవ్వడం.. వారి విధులను పర్యవేక్షించడం నారాయణరావు బాధ్యత అని సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ వెల్లడించారు.

విద్యాభివృద్ధికి మాగులూరి ఫౌండేషన్ కృషి

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని 75 తాళ్లూరు హైస్కూల్‌ను పవాస భారతీయుడు ఎం.భాను ప్రకాష్ బుధవారం సందర్శించి 9, 10వ తరగతి విద్యార్థు లకు నిర్వహించిన మోటివేషన్ తరగతు లలో పాల్గొన్నారు. పాఠశాలలో జరుగుతున్న బోధనను, కిచెన్, గార్డెన్‌ను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి తమ మాగులూరి ఫౌండేషన్ సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. పాఠశాలకు విచ్చేసిన భానుప్రకాష్‌ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎ.శ్రీనివాస రెడ్డి, పీసీ చైర్మన్ జి.పున్నారావు, కె.ప్రసాద్, కె.కిరణ్ కుమార్, పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు తెనాలి కరెంట్ సబ్ స్టేషన్‌లో బుధవారం వినతి పత్రం ఇచ్చారు. సాంబశివుడు మాట్లాడుతూ గృహ, వాణిజ్య విద్యుత్ శక్తి వినియోగంపై ధరలను విపరీతంగా పెంచుతున్నారని, విద్యుత్‌శక్తి వాడకం మీద వచ్చే బిల్లు కంటే అధనంగా వేసిన ఛార్జీలైన ఫిక్స్‌డ్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, సర్ ఛార్జి, ట్రూ అప్ ఛార్జీ మొదలైనవి కలిపి రెండు రెట్లు అధికంగా ఉన్నాయని, ఇది సామాన్య, మధ్యతరగతి ప్రజలకు పెనుభూతంగా మారిందని అన్నారు. కార్యక్రమంలో తెనాలి మండల ప్రెసిడెంట్ కర్లపూడి బుల్లియ్య, ఓబీసి స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గుర్రపు ద్వారకా శ్రీనివాస్, పెనుగొండ శివకుమార్, రమేష్, టి.శివనారాయణ, రాయప్పు, శంకరరావు, వీరాస్వామి, శ్రీను, నామన మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

పేదరికాన్ని తరిమికొట్టే ఆయుధం విద్య : లేళ్లఅప్పిరెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ముస్లిం మైనార్టీల జీవితాల్లో ముసురు కున్న పేదరికపు చిమ్మ చీకట్లు కేవలం విద్య వెలుగులతోనే తొలగుతాయని ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాప కులు లేళ్ళ అప్పిరెడ్డి పేర్కొన్నారు. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రెడ్డి కళాశాల సమీపంలోని భవానీపురంలో గల మదరసాలో విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్, మదరసా నిర్వాహకుడు మౌలానా అబ్దుల్ రెహ్మాన్, కార్పొరేటర్లు షేక్ రోషన్, ఆచారి, అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, దూపాటి వంశీ, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, వైసీపీ నాయకులు బత్తుల దేవానంద్, రెడ్డి కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, షాదీ కమిటీ చైర్మన్ షేక్ ఫరియాజ్ పాల్గొన్నారు.

ప్రజలకు ఆరోగ్య సంజీవని ప్రగతి నర్సింగ్ హోమ్

50 ఏళ్లుగా వైద్యసేవల ప్రస్థానం

విశాలాంధ్ర-చిలకలూరిపేట : వైద్యుడంటే ఓ సల హాదారుడు, మార్గదర్శి, శ్రేయోభిలాషి, ప్రాణ రక్షణ కుడు.. ఒక్క మాటలో చెప్పాలంటే దైవ సమానుడు..!. ఒక ప్రాణాన్ని నిలబెట్టినప్పుడో, ప్రమాదకరమైన సమ స్యను గుర్తించి.. చికిత్స చేసినప్పుడో ఆ డాక్టర్లలో కలిగే ఆ సంతృప్తే వేరు. అలాంటి తృప్తి, సంతృప్తి పొందాలంటే కచ్చితంగా వైద్య వృత్తిపై ఓ నిబద్ధత, ప్రణాళికా, అమితమైన ఇష్టం, సేవ గుణం వంటి తదితర లక్షణాలు ఉండాలి. అమ్మ జన్మనిస్తే.. వైద్యులు పునర్జన్మనిస్తారు. అందుకే వాళ్లను వైద్యో నారాయణోహరి అంటారు. చిలకలూరిపేట పరిసర ప్రజలకు రెండుతరాలుగా రోగుల ప్రాణాలు కాపాడేందుకు రాత్రి, పగలు తేడా లేకుండా సేవలందిస్తూ వస్తున్న ప్రగతి నర్సింగ్ హోమ్ 50వ సంవత్సరంలో అడుగుపెట్టనుంది. పేద గొప్ప భేదం లేకుండా, 'వచ్చిన రోగికి వైద్యం చేయాలనే సంకల్పంతో 1975 సంవత్సరం జనవరి 19 తేదీన సీఆర్ క్లబ్ ఎదుట మాజీ ఎంపీ స్వర్గీయ కొల్లా వెంకయ్య కుమారుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు, ఆయన సతీమణి డాక్టర్ హేమంతిదేవి ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం మారెళ్లవారివీధిలో సొంత స్థలంలో ఆసుపత్రి విస్తరించారు. అప్పట్లో ఆసుపత్రి ఎదురుగా రేగు చెట్టును కొట్టి వేయాలని, ఇది అశుభమని పలువురు సూచించినా డాక్టర్ కొల్లా రాజమోహనరావు అంగీకరించలేదు. కాలక్రమేణ అదే ఆసుపత్రి రేగు చెట్టు ఆసుపత్రిగా ప్రజల్లో ప్రాచుర్యం పొందింది. ఇదే రేగుచెట్టు నాటి నుంచి ఇప్పటికి ఆసుపత్రి ఎదుట 50 ఏళ్ల వైద్యసేవల ప్రస్థానానికి సాక్షిగా నిలుస్తోంది. నాడు చిలకలూరిపేట పట్టణంలో వైద్య సేవలు అంతగా విస్తరించని రోజుల్లో డాక్టర్ కొల్లా రాజమోహనరావు, హేమంతిదేవిల ఆధ్వర్యంలో కాన్పులు, ప్రసూతి వైద్యం, స్త్రీల సమస్యలకు సంబంధిత చికిత్సలు, చిన్నపిల్లల వైద్యం, అత్యవసర చికిత్సలకు ఈ ఆసుపత్రే కేంద్రంగా ఉండేది. దీంతో సాధారణ వైద్య సేవలు విస్తృతంగా అందించేవారు. ఆరోజుల్లోనే అన్ని సదుపాయాలతో కూడిన, మెరుగైన వైద్య సేవలు చిలకలూరిపేటలోనే అందేవి.

ఇటు వైద్య సేవ.. అటు సామాజిక సేవ...

సమర్థులైన వైద్యులు ఎందరో ఉంటారు. సేవాభావం కలిగిన వైద్యులు కొందరే ఉంటారు. సమర్థత, సేవాభావం రెండూ ఉన్న వైద్యులు అతికొద్దిమందే ఉంటారు. అటువంటివారిలో ముందు వరుసలో ఉంటారు డాక్టర్ కొల్లా అమర్. లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ ప్రజలతోపాటుగా, గ్రామీణ ప్రాంతంలోనూ ఉచిత వైద్య శిబిరాలు, అవగాహనా సదస్సులు నిర్వహించారు. డాక్టర్ కొల్లా రాజమోహనరావు, హేమంతిదేవిల వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని ఆసుపత్రి బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కొల్లా అమర్, డాక్టర్ భాగ్యమాల ఆధ్వర్యంలో నాణ్యతతో కూడిన వైద్యాన్ని ప్రజలకు అందించాలన్న ఉద్దేశంతో అధునాతన సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చారు. ఇటీవల ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా సమయంలో వేలాది మందికి వైద్య సేవలు అందించి, అమర్ ఇటు ప్రజల, అటు ప్రభుత్వ ప్రశంసలు అందుకున్నారు. వైద్య రంగం నుంచి కరోనా సమయంలో అందించిన సేవలకు ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. వైద్యసేవలు కొనసాగింపుగా మూడో తరం డాక్టర్ సుజన్ మోహన్, విజయ్‌మోహన్‌లు కూడా సేవలు అందిస్తారని ఆశిస్తున్నారు. తరాలుగా 50 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తున్న ప్రగతి నర్సింగ్ హోమ్ మరింతగా చేరువౌతుందని ఆశిద్దాం.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర-దుర్గి: అన్నదానం ఆకలిని తీర్చ గలిగితే అక్షరదానం అజ్ఞానాన్ని తొలగిస్తుందని శ్రీతులసి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కెజీబీవి పాఠశాలల పదవ తరగతి 160 మంది విద్యార్థులకు ఎస్టీయూ వారిచే రూపొందించిన స్టడీ మెటీరియల్ బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పదవ తరగతి ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు కూడా ఈ మెటీరియల్ తర్వాత అందిస్తామని తెలిపారు. ఎస్టీయూచే రూపొందించబడిన మెటీరియల్ అందించుటకు మా సంస్థ సహకారం అందించామని, విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి స్కాలర్షిప్ కూడా అందిస్తామన్నారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే గంగాధర్ బాబు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు ఈ మెటీరియల్ చాలా ఉపయోగకరంగా ఉంటుందని మంచి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో రూపొందించబడిందని తెలిపారు. స్థానిక ఎస్టీయూ నాయకులు రాష్ట్ర కౌన్సిల్ నెంబరు జి సి హెచ్ అనంతరామయ్య, మండల అధ్యక్షులు నబీ సాహెబ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎర్రం ఏడుకొండలు, హనుమంతరావు, ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి 2 డి.బెంజిమెన్, హెచ్‌ఎం పి కోటేశ్వరమ్మ, ఎస్టీయూ 10వతరగతి మెటీరియల్ ఆవిష్కరించి విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న తులసి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంస్థ వారి సహకారం వారి సేవలు ఎనలేనివి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నీటి కాలుష్యాన్ని తగ్గించేందుకు చర్యలు

విశాలాంధ్ర-వినుకొండ : నీటి కాలుష్యాన్ని తగ్గించడంలో స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడంలో పౌరులకు సమతుల్యమైన ప్రకృతిని అందించడంలో ముందుండే మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఇటీవల స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో శ్రీకృష్ణ ఎన్విరో ఇంజనీర్ సంస్థ ద్వారా నిర్మించబడుతున్న మురుగునీటి శుద్ధి కర్మాగార(ఎస్టీపీ)నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. మురుగు నీటి నుండి కలుషితాలు తొలగించడానికి, నీటిని పునర్వినియోగానికి, సురక్షితంగా చేయడానికి ఎస్టీపీలు చాలా అవసరమని కమిషనర్ ఉద్ఘాటించారు. నీటి ద్వారా వచ్చే వ్యాధులను నివారించడంలో, జలచరాలను రక్షించడంలో మరియు నీటి వనరుల మొత్తం నాణ్యతను కాపాడుకోవడంలో ఎస్టీపీల ప్రయోజనాలను కూడా ఆయన చర్చించారు. పట్టణంలో రెండు ఎస్టీపీ ప్లాంట్లు ఒకటి 5.7 ఎంఎల్డీతో ముట్లగుంట కాలనీ వద్ద రెండోది 5.5 ఎంఎల్డీతో ఎన్ ఆర్ టి రోడ్ నిర్మలా స్కూల్ చెక్ వాగు వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు, వీటిని ఏప్రిల్ లేదా మే నెల చివరి నాటికి పూర్తి చేసి వినియోగంలోనికి తీసుకువస్తున్నామని తెలిపారు. ఈ పర్యావరణ హితాభివృద్ధి పనులకు ప్రోత్సాహం అందిస్తున్న చీఫ్ విప్ ఎమ్మెల్యే జి వి ఆంజనేయులుకు కమీషనర్ మరోమారు కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి గుంటూరు కళాపరిషత్ వార్షిక నాటకోత్సవాలు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు కళా పరిషత్ 27వ వార్షిక నాటకోత్సవాలను ఈ నెల 10, 11, 12 తేదీల్లో గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్నట్లు కళాపరిషత్ గౌరవ సలహాదారులు ఆలోకం పెద్దబ్బయ్య, ఉపాధ్యక్షులు నాయుడు గోపి, ప్రధాన కార్యదర్శి బి.పూర్ణ తెలిపారు. విజ్ఞాన మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాటకోత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటకోత్సవాలకు వేదికైన శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరానికి ప్రముఖ రంగస్థల, చలనచిత్ర నటులు కీ.శే. సి.నాగభూషణం కళాప్రాంగణంగా నామకరణం చేసినట్లు చెప్పారు. అదేవిధంగా తొలిరోజు 10వ తేదిన కీ.శే. కొడాలి గోపాలరావు కళావేదికపై సాయంత్రం 6 గంటలకు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. తొలుత విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్ వారి 'స్వేచ్ఛ' నాటికను ప్రదర్శిస్తారని, రాత్రి 7.15 గంటలకు గుంటూరు కళాపరిషత్ అధ్యక్షులు పీవీ మల్లికార్జునరావు అధ్యక్షతన సభ ప్రారంభమౌతుందని వివరించారు. రాత్రి 7.45 గంటలకు శ్రీ సాయి ఆర్ట్స్, కొలకలూరి వారి 'జనరల్ భోగీలు' అనే సాంఘిక నాటిక ప్రదర్శిస్తారన్నారు. రాత్రి 9 గంటలకు కళానికేతన్, వీరన్నపాలెం వారి 'ఋతువులులేని కాలం' అనే సాంఘిక నాటిక ప్రదర్శితమౌతుందని చెప్పారు. రెండవరోజు 11వ తేదీ కీ.శే. వల్లూరి వెంకట్రామయ్య చౌదరి కళావేదికపై సాయంత్రం 6.30 గంటలకు జ్యోతి ప్రజ్వలనతో సభ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. కళాపరిషత్ ఉపాధ్యక్షులు నాయుడు గోపి అధ్యక్షతన జరిగే సభకు ముఖ్యఅతిథిగా ప్రముఖ పౌరాణిక నటులు, దర్శకులు, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ హాజరు అవుతారన్నారు. రాత్రి 7 గంటలకు గంగోత్రి, పెదకాకాని వారి 'అష్టమ వసువు' సాంఘిక పద్య నాటకం ప్రదర్శిస్తారన్నారు. మూడవ రోజు 12వ తేదీ కీ.శే. కన్నెగంటి నాసరయ్య కళావేదికపై ఉదయం 10 గంటలకు గుంటూరు కళాపరిషత్, వేదిక సంయుక్త ఆధ్వర్యంలో 'సి.నాగభూషణం నటప్రస్థానం' అను పేరుతో సదస్సు జరుగుతుందని, ఈ సదస్సులో 'నాగభూషణం ప్రజానాట్యమండలి' అను అంశంపై నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), 'నాగభూషణం నాటక రంగం' అను అంశంపై డాక్టర్ కందిమళ్ల సాంబశివ రావు, 'నాగభూషణం-సినిమా రంగం' అను అంశంపై రెంటాల జయదేవ్ ప్రసంగిస్తారని వెల్లడించారు. సాయంత్రం 6.30 గంటలకు జ్యోతి ప్రజ్వలనతో సభా కార్యక్రమం ప్రారంభమవుతుంది. సభకు పరిషత్ గౌరవ సలహాదారులు ఆలోకం పెద్దబ్బయ్య అధ్యక్షత వహిస్తారని, ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత, సాహితీవేత్త, అరసం జాతీయ అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ హాజరవుతారని తెలిపారు. రాత్రి 7 గంటలకు మిత్ర క్రియేషన్స్, హైదరాబాద్ వారి 'మట్టి మనిషి' సాంఘిక నాటకం ప్రదర్శిస్తారని వివరించారు. ఈ సమావేశం లో కళాపరిషత్ అధ్యక్షులు పీవీ మల్లికార్జునరావు, కార్యదర్శి గుమ్మడి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు షేక్ సైదా, ఆవుల సుబ్బారావు, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

విశాలాంధ్ర-దాచేపల్లి : ఎస్టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను నగర పంచాయతీ సహా గ్రామీణ మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం అందజేశారు. తంగెడ రామాపురం, దాచేపల్లి, కేసానపల్లి, ముత్యాలంపాడు, గామాలపాడు, మాదినపాడు, పెదగార్లపాడులోని ఉన్నత పాఠశాలలు, అదేవిధంగా కేసానపల్లిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, దాచేపల్లిలోని ఆదర్శ పాఠశాల, బీసీ బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు దాదాపు 750 మంది ఉన్నారు. వారికీ ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, తంగెడ హెచ్‌ఎం లింగిరెడ్డి వెంకట్రామిరెడ్డి అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ముత్యాలంపాడులోని రెండు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్యాంకుమారి, గుదిబండి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

దక్షిణ భారత విద్య వైజ్ఞానిక ప్రదర్శనకు దిలీప్

విశాలాంధ్ర-దాచేపల్లి: ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి ప్రజాపతి దిలీప్ తయారు చేసిన ప్రాజెక్టు దక్షిణ భారత విద్య వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. శ్వాస సంబంధిత వ్యాధులకు కృత్రిమంగా శ్వాస అందించడం కోసం ఈ విద్యార్థి తయారు చేసిన పరికరాన్ని (ప్రాజెక్టు) బుధవారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్సు ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. దాంతో ఈ ప్రాజెక్టును దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక చేశారు. ఈ నెల 21 నుంచి 25 వరకు పాండిచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి ప్రదర్శనకు ఈ ప్రాజెక్టును విద్యార్థి దిలీప్ తీసుకెళ్ళనున్నాడు. ఇటీవల నరసరావుపేటలో పల్నాడు జిల్లా స్థాయిలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ఈ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైన విషయం విదితమే. తాజాగా జాతీయ స్థాయిలో కూడా ఎంపిక కావడంతో రాష్ట్ర సమగ్ర శిక్ష సంచాలకులు శ్రీనివాస్, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణా రెడ్డి చేతుల మీదుగా విద్యార్థి దిలీప్ పతకం అందుకున్నారు.

విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

విశాలాంధ్ర-మంగళగిరి : విద్యార్థులు విద్యతో పాటు ఆటలు, క్రీడలు పట్ల ఆసక్తి పెంచుకోవాలని నిర్మల ఫార్మసీ కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి అన్నారు. మంగళగిరిలోని నిర్మలా ఫార్మసీ కళాశాలలో నిర్మల ప్లే ఆఫ్స్ 2025 బుధవారం సాయంత్రం ఎంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిస్టర్ జి.నిర్మల జ్యోతి పాల్గొని ప్రసంగిస్తూ క్రీడలు వ్యక్తిగత అభివృద్ధికి ఆరోగ్యకరమైన జీవితానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. ఆటలలో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చని ఆమె అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాముల రెడ్డి మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయని ప్రతి విద్యార్థి పాల్గొని తమ ప్రతిభను కనపరుచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాష్ మాబ్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నిర్మల ప్లే ఆఫ్స్ 2025 కోఆర్డినేటర్ డాక్టర్ కె.సౌజన్య కోకో కోఆర్డినేటర్ ఆర్.రత్న, మంజుల, వి.జోజి బాబు, కళాశాల వివిధ విభాగాధిపతులు డాక్టర్ హరే కృష్ణ రాయ, డాక్టర్ పద్మావతి, డాక్టర్ షేక్ ఆశ బేగం డాక్టర్ జి.స్వప్న, డాక్టర్ షేక్ అలీ, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, బిఫార్మసీ, ఫార్మా డీఎం ఫార్మసీ, డి ఫార్మసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శతవార్షికోత్సవాల్లో వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

విశాలాంధ్ర- కూచిపూడి : మొవ్వ మండలం కాజ గ్రామంలో కృష్ణా జిల్లా చేనేత కార్మిక సంఘ అధ్యక్షుడు కోడాటి నారాయణరావు ఇంటి ప్రాంగణంలో బుధవారం భారత కమ్యునిస్టు పార్టీ శత వార్షికోత్సవ ప్రారంభ వేడుకలలో గోడపత్రికలను ఆవిష్కరించారు. సభలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ పేద వర్గాల కోసం చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను వివరించారు. పేదలకు ఎల్లవేళలా ఎర్రజెండా అండగా నిలబడి సమస్యలను పరిష్కరిస్తుందని పేర్కొన్నారు. పామర్రు నియోజకవర్గ సీపీఐ సమితి కార్యదర్శి చెరుకు శ్రీనివాస రావు, నియోజకవర్గ సహాయ కార్యదర్శులు కోసూరు వెంకట అప్పారావు, చందోలు నాగేశ్వరరావులు, పామర్రు నియో జక వర్గ సమితి ప్రత్యేక ఆహ్వానితులు కోడాటి నారాయణరావు, కాజశాఖా కార్యదర్శి నందం వేంకటేశ్వరరావు, సీపీఐ పార్టీ సభ్యులు, చేనేత కార్మికులు కోడాటి ఈశ్వరప్రసాద్, నందం నరసింహారావు, చిరందాసు సత్య నారాయణ, పంచల మోహన్‌రావు, నందం శ్రీనివాసరావు, కొన్నిపాటి శ్రీనివాసరావు, నందం జగదీష్, సుధాకరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బోరింగ్ పంపు వితరణ

విశాలాంధ్ర-గూడూరు: పెడన శ్రీ బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూని యర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థుల తాగునీరు సౌకర్యార్థం కీ॥శే॥ పేరి శెట్టి నాగేంద్రం కోటపైడమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు పేరిశెట్టి నాగరవి, లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు ఏర్పాటు చేసిన బోరింగ్ పంపును కళాశాల ప్రిన్సిపాల్ కేసీఎస్వీఎస్ రామారావు ప్రారంభిస్తూ, విద్యార్థులకు అవసరమైన సమయంలో తాగునీటి వసతి కల్పించడం ఆనందంగా ఉందన్నారు. తాగునీటి వసతిని విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలన్నారు. కళాశాల లైబ్రరీసైన్స్ అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి మాట్లా డుతూ ప్రభుత్వం ఇటీవల ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేసిన సందర్భంగా విద్యార్థులకు అవసర మైన వాడుకనీరు, తాగునీరు సమకూర్చాలనే సదుద్దేశంతో వాటర్స్, క్రీడాకారులు కూడా నీటివసతిని ఉపయోగించుకోవాలని నాగరవి ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు పేరి శెట్టి నాగరవి, అధ్యాపకులు కట్టా వెంకట నాగేశ్వరరావు, వి.నిరంజనరావు,సైదా, గంగాధర్, గిరి, విద్యార్థినీ విద్యార్థు పాల్గొన్నారు.

జీవిత ధృవీకరణలు అందజేయాలి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విశ్రాంత ఉద్యోగులంతా తమ జీవిత ధృవీకరణలు(లైవ్ సర్టిఫికెట్లు) అధికారులకు వెంటనే అందజే యాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం విస్సన్నపేట యూనిట్ నాయకులు కోరారు. స్థానిక సంఘం కార్యాలయంలో బుధవార సమావేశమయ్యారు. సంఘం అధ్యక్షుడు ఎన్.సూరిరాజు మాట్లా డుతూ, ఈనెల 10వ తేదీలోగా యూనిట్ పరిధిలోని విస్సన్న పేట, చాట్రాయి, రెడ్డిగూడెం మండలాలకు చెందిన వారంతా తమ పత్రాలను సంఘం సభ్యుల ద్వారా లేక నేరుగా విస్సన్నపేట ఉప ఖజానా కార్యాలయానికి అందజేయాలని సూచించారు. అనంతరం సంఘం ముద్రించిన డైరీని ఆవిష్కరించి, సభ్యులకు పంచారు. కార్యక్రమంలో కార్యదర్శి కంకట మోహనరావు, ఉపాధ్యక్షుడు కొప్పోలు నాగేశ్వరరావు, సభ్యులు ధనరాజు, జెటి.రాజేంద్ర ప్రసాద్, వివిఎస్‌కె.జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి జగనన్న కాలనీలు తనిఖీ

విశాలాంధ్ర- కూచిపూడి : మొవ్వ మండలంలోని పెదపూడి లో గత ప్రభుత్వ హయాంలో భూములు కొని పేదవర్గాలుగా అందజేసిన జగనన్న కాలనీ రూపు రేఖలను మంగళవారం రాత్రి విజిలెన్స్ అధికారులు పరిశీలిం చారు. ఆ కాలనీలో ఏర్పడిన వసతి సౌకర్యాలను ప్రజలకు కావలసిన వసతులపై ఆరాతీశారు. ప్రభుత్వానికి తమ భూముల అమ్మిన రైతులలో కొందరైన పులిదుర్గాప్రసాద్, దగాని వెంకటేశ్వరరావు, దగాని రాధా కృష్ణల నుంచి భూములకు సంబంధించిన వివరాలు సేకరించారు. జగనన్న కాలనీకి విక్రయించిన ఎ.5.75 సెంట్లలో నిర్మించిన ఇళ్ల వివరాలను సేకరించారు. భూమి విక్రయించిన వారికి డబ్బులు పూర్తిగా వచ్చాయా? రాలేదా? ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొన్నారా? అడిగి వారి నుంచి సమాధానాలు సేకరించారు. కాలనీలో లైట్లు వెలుతురులోనే వివరాలను సేకరించి నమోదు చేసుకు న్నారు. వీరితో పాటు మొవ్వ మండల గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారి జి. వంశీ, పెదపూడి సచివాలయ వీఆర్వో కె.బి. రాజేంద్రప్రసాద్ రైతులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం : తంగిరాల సౌమ్య

విశాలాంధ్ర-నందిగామ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తుందని పేదలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ పట్టణం కాకాని నగర్ కార్యాలయంలో ఒకేసారి 8 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.7,24,232లు విలువైన చెక్కులను చందర్లపాడు, కంచికచర్ల, వీరులపాడు, నందిగామ మండలం, పట్టణం లోని లబ్ధిదారులకు అందజేశారు. తంగిరాల సౌమ్య మాట్లా డుతూ, ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూనే హార్ట్, కేన్సర్, కిడ్నీ వంటి ప్రాణాంతక వ్యాధులతో బాధపడే నిరుపేద రోగులకు వైద్య ఖర్చుల భారం పడకుండా సకాలంలో సీఎంఆర్ఎఫ్ ఫండ్ కింద నిధులు విడుదల చేస్తోందని తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ఆపరేషన్ల నిమిత్తం సమయానికి ఎల్‌ఓసీలు అంద జేస్తూ వారి ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేస్తున్నామ న్నారు. వివిధ హోదాలో ఉన్న కుటమి నాయకులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర- కంచికచర్ల: కోడిపందాలు నిర్వహించుట చట్టరీత్యా నేరమని ఎంపీడీఓ లక్ష్మీ కుమారి, తహసీల్దార్ జాహ్నవి వీఓఆర్డీ శ్రీనివాసరావులు బుధవారం అన్నారు. కోడిపందాల నిర్వహణపై నాలుగు శాఖలను అను సంధానం చేసుకొని సంయుక్త సమావేశం నిర్వహించిన మండల ఎగ్జిక్యూటివ్ కార్యవర్గం స్థానిక ఎంపీడీఓ ఆఫీస్‌లో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సంయుక్త సమావేశంలో రెవెన్యూ, మండల పరిషత్, పోలీస్, పశుసంక్షేమ శాఖ అధికారులతో కమిటీ ఏర్పరిచారని తెలిపారు. కంచికచర్ల మండల తహశీల్దార్ పి జాహ్నవి మాట్లాడుతూ కోడిపందాల నిర్వహణ చట్ట రీత్యా నేరమని, హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి వ్యవహరించాలని తెలిపారు. సెక్షన్ 10 ఆంధ్ర ప్రదేశ్ గ్యాంబ్లింగ్ యాక్ట్ ప్రకారం, సెక్షన్ 34 జంతు హింస నివారణ చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. మండలంలోని గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోడి పందాలు జరగకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మండల ప్రజలకి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - బంటుమిల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. జగన్ మోహన రావు సారధ్యంలో ఏర్పాటు చేసిన ఈ సంక్రాంతి సంబరాలు కళాశాల గ్రౌండ్లో ఘనంగా జరిగాయి. కంప్యుటర్స్ అధినేత డాక్టర్ సత్య రాజేష్ ఈ వేడుకలకు స్వాగతం పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ జగన్ మోహన రావు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల నేపథ్యంలో మానవ ఐక్యమత్యత, ఆత్మీయత, అనురాగం,ప్రేమానుబంధాలు కనిపిస్తాయని కాబట్టి విద్యార్థిని విద్యార్థులు ఈ సంగతులు దృష్టిలో పెట్టుకుని సమసమాజ స్థాపనలో ప్రముఖ పాత్ర వహించే పండుగలో,వారు సమర్థవంతంగా తమ కుటుంబ బాధ్యతలు నిర్వర్తించాల్సిందిగా పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గుర్తింపు పొందినటువంటి ప్రజా గాయకుడు సూరగం రామకృష్ణ ప్రత్యేకమైనటువంటి గీతాలు ఆలపిస్తూ విద్యార్థులను ఉర్రూతలూగించారు. తద్వారా గేయాల ద్వారా సమసమాజ స్థాపనకు కావలసిన సూచనలు చేశారు. కోఆర్డినేటర్, కామర్స్ శాఖాధిపతి ఆర్ హిమాలిని దేవి సారధ్యంలో విద్యార్థిని విద్యార్థులు భోగి మంటలు వేసి కోలాట ప్రదర్శన చేశారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆటపాటల్లో విజేతలైనటువంటి వారికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ జగన్ మోహనరావు బహుమతి ప్రధానం చేశారు. ఈ సంక్రాంతి సంబరాల్లోవైస్ ప్రిన్సిపాల్ బి.దేవజయ రాజు,ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్. జిబి ఆనంద కుమార్, జ్యోత్స్న,సుజాత, రత్నచలం ప్రసాద్ మొదలైన వారితో పాటు అధ్యాపకేతర సిబ్బంది కూడా పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

- అధికారులకు గ్రామ ప్రజలు విజ్ఞప్తి

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం ఆగిరిపల్లి రోడ్డు 17 కోట్లతో రోడ్డు నిర్మిస్తున్నారు కానీ రోడ్డు ప్రక్కన ఆక్రమించుకొన్న ఆక్రమణలు తొలగించాలని నాలుగు గ్రామాలప్రజలు చిక్కవరం గోపర గూడెం, గొల్లపల్లి, బి బి గూడెం ప్రజలు అధికారులను కోరారు. నాలుగు రోడ్లు సెంటర్ కావటం అటు నుండి వచ్చే వాహనాలు ఆక్రమాలను వల్లనే రోడ్ కనిపించక పోవటం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అందువల్ల ప్రమాదాలు జరకుండా ఉండేందుకు ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాలుగు రోడ్లసెంటర్లో ఆగిరిపల్లి నుండి గన్నవరం వయ టు విజయవాడ వెళ్లే క్వారీ లారీలు నిత్యం వెళుతుంటాయని, బస్సులు వాహనాలు వెళుతుంటాయి బడ్డీ కోట్లు అక్కడ ఆపిన వెహికల్స్ రద్దీగా ఉండటం వల్లనే వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉంటుంది. నిత్యం రద్దీగా ఉండే నాలుగు రోడ్డు సెంటర్ నుండి వచ్చే గోపవరపు గూడెం చిక్కవరం నుండి వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయి. అక్కడే గత ఏడాది అదే చోట నాలుగు ప్రమాదాలు జరిగి నలుగురు మరణించారని పలువురు ఆరోపించారు. రోడ్డు ప్రక్కల ఆక్రమాలు మేరకు ఉండటం వలన రోడ్డు పై నీళ్లు నిలిచి గుంతలు పడే ప్రమాదం ఉంది. అలాగే ఆక్రమాల కింద గన్నవరం వెల్వేటార్ వైపు లైను మెగా గ్యాస్ పైపులు కూడా ఉన్నవి ఆక్రమాల్లో ప్రభావం కూడా గ్యాస్ లీక్ అయ్యే ప్రమాదం చోటు చేసుకోకుండా ప్రజలను కాపాడాలని, అందువల్ల ఆక్రమాలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రమాదాలు నుండి రక్షించాలని అధికారులను రోడ్డు కాంట్రాక్టర్‌ను గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కోడిపందేల అదుపుకు గ్రామ కమిటీల ఏర్పాటు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలంలో కోడి పందాలను అదుపు చేసేందుకు గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని విస్సన్నపేట తహశీల్దార్ కె.లక్ష్మీ కల్యాణి తెలిపారు. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, మహిళా కానిస్టేబుల్, పశుసంవర్ధకశాఖ ఉద్యోగులతో కలసిన కమిటీలు గ్రామాల్లో పర్యవేక్షణ చేయనున్నట్లు పేర్కొన్నారు. సాంప్రదాయాల పేరుతో కోడిపందాలు నిర్వహించాలంటే కత్తులను వినియోగించకుండా ఏర్పాటు చేసుకోవచ్చని ఆమె సూచించారు.

అర్జీలు సేకరణ

విశాలాంధ్ర-మచిలీపట్నం: సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కొరకు అర్జీలు సేకరిస్తున్న కార్యక్రమం 51 డివిజన్‌లోని మందులు గూడెంలో బుధవారం కూడా కొనసాగింది. ఇల్లు లేని పేదల ఇళ్ల స్థలాలు కోసం నగరంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు అందించాలని కోరుతూ సీపీఐ మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో పేదల నుంచి అర్జీలు స్వీకరణ కొనసాగు తుంది. సీపీఐ నియోజవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్, సహాయ కార్యదర్శి ఓడుగు చైతన్య కుమార్, మహిళా సమైక్య నాయకురాలు ఓడుగు రత్నకుమారి, గున్న కోటు కేశవులు ఎల్లకోట వెంకన్న, గుర్రు వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్మశానవాటిక అభివృద్ధికి విరాళాలు

విశాలాంధ్ర - చల్లపల్లి : చల్లపల్లి హిందూ స్మశానవాటిక అభివృద్ధికి పలువురు బీసీ (గౌడ) సంఘ ప్రముకులు విరాళాలను మన కోసం మనం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ డిఆర్కె ప్రసాద్కు అందచేశారు. వేముల అర్జునరావు రూ.50వేలు, వేముల వెంకటేశ్వర రావు రూ.10వేలు, వేముల వెంకట భాస్కరరావు రూ.10 వేలు, వేముల వేణు రూ.10వేలు, వీరంకి రంగారావు రూ.10వేలు, కారంకి ఫణి రూ.10వేలు మొత్తంగా లక్ష రూపాయలను తమవంతు సహాయంగా స్మశానవాటిక అభివృద్ధి కోసం అందించారు. దాతలకు డిఆర్ కె.ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సౌకర్యాలపై వారికున్న బాధ్యతలపై అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పీఆర్ ఏఈ వేముల శేషగిరిరావు, దాతలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు భూ రీసర్వే : ఎమ్మెల్యే కాగిత

విశాలాంధ్ర - బంటుమిల్లి : అపరిష్కృతంగా మారిన రైతుల పొలాల సమస్యలను పరిష్కరించి రైతుకు అండగా నిలవా లనే తలంపుతో కూటమి ప్రభుత్వం భూ రీ సర్వే కార్యక్ర మాన్ని చేపట్టిందని రైతులు దీనిని సద్వినియోగం చేసుకుని సమస్యలకు శాశ్వత పరిష్కారం పొందాలని పెడన నియో జకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మొట్ట మొదటి సారిగా మండల పరిధిలోని మల్లేశ్వరం గ్రామంలో భూ రీసర్వే కార్యక్రమాన్ని బుధవారం స్థానిక శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ రెవిన్యూ శాఖాధికారులతో కలసి ప్రారంభించారు. కాగిత కృష్ణప్రసాద్ మాట్లడుతూ గత వైసీపీ ప్రభుత్వం భూ రీసర్వే పేరుతో అడ్డగోలుగా రైతుల భూములను వారు అన్యాక్రాంతం చేసుకుని రైతులకు అన్యాయం చేశారన్నారు. రైతులకు వారు చేసిన తప్పులను సరిచేస్తూ రైతు తక్షణ న్యాయం పొంది శాశ్వత పరిష్కారం పొందేలా రైతు సమక్షంలో భూ రీసర్వే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. అధికారులు తొందరపాటు తనంతో తప్పులుచేయకుండా రోజుకు 20 ఎకరాల చొప్పున నెమ్మదిగా రీసర్వే నిర్వహించి పొలం హద్దులు, కొలతలతో ఎటువంటి తేడాలేకుండా మీ భూమి మీకు అప్పజెప్పడం జరుగుతుందన్నారు. పొలం కొలతకు అధికారులు వచ్చిన సమయంలో ఆ పొలం రైతు దగ్గరు ఉండి సరిచేసుకోవాలన్నారు. లేనిపక్షంలో వారి తరువు వారిని పంపించి సరిచేయించుకోవాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి చెన్ను శ్రీనివాసరావు, తహాశీల్దార్ భరత్ రెడ్డి, మండల సర్వేయర్ దాసు, ఆయా గ్రామల సర్వేయర్లు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సువిశేశ్వరరావుకు మోదుమూడి పరామర్శ

విశాలాంధ్ర-గుడివాడ : అనారోగ్యంతో బాధ పడుతూ కోలుకున్న సీపీఐ నాయకులు గూడ పాటి సువిశేశ్వరరావును సీపీఐ కంట్రోల్ కమిటీ సభ్యులు మోదుమూడి రామారావు, మహిళా సమాఖ్య సభ్యురాలు మోదుమూడి అరుణకుమారి పరామర్శించారు. స్థానిక పెద్దఎరికిపాడులోని గూడపాటి సువిశేశ్వరరావు స్వగృహంలో బుధవారం ఆయన్ను పరామర్శించి ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. గతంలో సీపీఐ తరుపున చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు, సభ్యులు బేతపూడి సునీత, కంచర్ల మేరిమ్మ, పొట్ల సంతోషమ్మ, నిర్మలజ్యోతి, భవానీ పాల్గొన్నారు.

నాటు సారా నిర్మూలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పెడన: నవోదయ కార్యక్రమం నాటు సారా నిర్మూలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఏపీ ఎన్ఫోర్స్మెంట్ & ఎక్సైజ్ డిపార్ట్మెంట్ అడిషనల్ సూపరిటెంట్ పి భార్గవ్ అన్నారు. పట్టణంలోని 19 వ వార్డు దక్షిణ తెలుగు పాలెంలో గ్రామ సభను నిర్వహించి నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్ స్పష్టం చేశారు. నాటు సారా రహిత జిల్లాగా చేయడానికి కృషి చేస్తు న్నట్లు తెలిపారు. నాటు సారా తయారీ గురించి వదిలిపెడితే వారికి భవిష్యత్తులో జరగకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామన్నారు ఇందు కోసం గ్రామ స్థాయిలో కమిటీలు మండల స్థాయి లో కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుంద న్నారు ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ పి వెంకటేశ్వరమ్మ ఎస్సై రవి కౌన్సిలర్ సిరివెళ్ల జై యేసు, ఉపాధ్యా యుడు మురళి,వీఆర్ఓ నాగ ఆంజనేయులు మహిళా పోలీసులు అంగన్వాడి కార్యకర్తలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కోడి పందేలు, క్యాసినో జూదాలకు అనుమతులు లేవు: డీసీపీ

విశాలాంధ్ర-నందిగామ : సంక్రాంతి పండుగ సందర్భంగా విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు ఆద్వర్యంలో ఎలాంటి కోడి పందాలకు, కాసినో, జూదాల వంటి వాటికి ఎక్కడా అనుమతులు ఇవ్వలేదని విజయ వాడ రూరల్ డీసీపీ మహేశ్వర రాజు తెలిపారు. బుధవారం నందిగామ సబ్ డివిజన్ పోలీస్ అధికారి కార్యాలయంలో గంజాయి కేసుకు సంబంధించిన వివరాలు అందజేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో ఎక్కడా కూడా కోడి పందాలకు కాసినో జూదల వంటి వాటిని జరగ కుండా నిరోధించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పెనుగంచి ప్రోలులో కాసినో జూదలు ఏర్పాటు చేస్తున్నారనే వదంతులపై అడిగిన ప్రశ్నకు సమా ధానంగా సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి గ్రామంలో ఆయా శాఖల అధికారులను కమి టీగా ఏర్పాటు చేసి కోడిపందాలను, జూదాలను నిరోధించ డానికి చర్యలు తీసుకుంటామని తెలి పారు. అలాగే వాహనదారులు ప్రయాణించే సమయ ంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇప్పటి వరకు వాహానాల మీద ఉన్న చలానా లను చెల్లించలాని, లేనట్లైతే వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ తిలక్ సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతిలో సాంస్కృతిక కార్యక్రమాలు

విశాలాంధ్ర-చందర్లపాడు : మండల కేంద్రమైన చందర్లపాడులో నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండలంలోని నందమూరి తారక రామారావు వర్ధంతి నిర్వహిస్తున్నట్లు డీసీ చైర్మన్ కోటవీరబాబు తెలిపారు. జనవరి 16,17,18 తేదీలలో సాంస్కృతిక కార్యక్రమాలు శ్రీకృష్ణరాయ భారం పూర్తి నాటకం, బాలనాగమ్మ, శ్రీరామంజనే యయుద్ధం, నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ విప్ మరియు శాసన సభ్యురాలు ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య, ఆర్. మల్లికార్జునరావు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, పొడపాటి తేజస్విని కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షుడు మేకల సుధాకర్‌బాబు, కందులకల్పన జిల్లా సమైఖ్య డ్వాక్రా మహిళా అధ్యక్షురాలు, బొబ్బిళ్ళ గోపాలకృష్ణశాయి బళ్ళారి రాఘవ కళాసమితి అధ్యక్షులు తదితరులు పాల్గొంటారు.

లారీ ఢీకొని ఇద్దరు మృతి

విశాలాంధ-కూచిపూడి : మొవ్వ మండలంలో యద్దనపూడి భీమ నది పంట కాలవకుఅయ్యంకి అడ్డరోడ్డుకు మధ్యలో లారీ ఢీకొని ఇద్దరు వ్యక్తులు అక్కడ అక్కడే మృతి చెం దిన సం ఘటన బుధవారం రాత్రి జరిగింది. సేకరించిన వివరాలు ప్రకారం అయ్యం కి కి చెందిన పడమట నాగరాజు (40), మల్లవోలుకు చెందినపడమట నాగ మునేశ్వరరావు (60) లు ద్విచక్ర వాహనంపై కూచిపూడి నుంచి అయ్యం కి గ్రామానికి వెళ్తున్నారు. భీమనది పంటకాలవ దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న లారీ ఢీకొని బలమైన గాయాల పాలై ఆ ఇద్దరు అక్కడికక్కడే చనిపో యారు. సమాచారం మేరకు కూచిపూడి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ నిర్వహిం చారు. పామర్రు ఎస్సై (కూచిపూడి ఇంచార్జ్) రాజేంద్రప్రసాద్ దర్యాప్తు చేపట్టారు.

CHANGE OF NAME
I,Pulidindi Richel Rajini Sofia (Old Name) Wo.Augustine Jyothi Raj Pulidindi, residing at # 54-16-4, 3rd Lane, Loyola Gardens, Vijayawada, NTR District Pin code.520008, A.P.,India.I have changed my name to **Pulidindi Rachel Rajini Sofia (New Name).** Hence Forth I will be Known as **PULIDINDI RACHEL RAJINI SOFIA**

CHANGE OF SURNAME AND NAME
I,Sheke Mohammad Hussene (Old Name) S/o.Khasim, residing at # 23-25-1/20, Kavurivari street, Near Sivaji Cafe, Satyanarayana Puram, Ntr District, Andhra Pradesh,Pin code.520011. I have changed my surname and name to **Shaik Mohammad Hussain (New Name).** Hence Forth I will be Known as **SHAIK MOHAMMAD HUSSAIN**

విజయవాడలో దారుణం

- ఆస్తి కొడుకు రాసిందనే కారణంతోనే ....
- ప్రియుడితో కలిసి కన్న తల్లిని హత్య చేసిన కూతురు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: విజయవాడలో దారుణం జరిగింది. ప్రియుడితో కలిసి కన్న తల్లిని హత్య కూతురు హత్య చేసింది. ఈ ఘటన బుధవారం ఇబ్రహీపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈఘటనకు సంబంధించిన వివరాలు మేరకు మైలవరంకు చెందిన జీవమణి అనే యువతి నాగూర్‌వలీ అనే యువకుడితో నాలుగు సంవత్సరాల క్రితం పరిచయం ఏర్పడింది. అదికాస్త ప్రేమగా మారింది. ఇది గమనించిన తల్లి ఎస్తేర్ కూతురుని పలుమార్లు మందలించింది. అప్పటికే యువతి జీవమణికి మరో పెళ్లికాగా, తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని, తను రావాల్సిన ఆస్తిని కొడుకు పేరును రాసిందని కక్షతో కన్న తల్లిని ప్రియుడితో కలిసి హతమార్చాలని ప్లాన్ వేసింది. ఈక్రమంలోనే మంగళవారం రాత్రి తల్లి ఎస్తేర్ తల్ల పై నాగూర్‌వలీ, జీవమణి రాయితో కొట్టి దారుణంగా హత్య చేశారు. అనంతరం అక్కడి నుంచి ఇద్దరు కలిసి పారిపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు రక్తపు మడుగులో ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్త మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుండెపోటుతో చల్లపల్లి వాసి మృతి



విశాలాంధ్ర - చల్లపల్లి : శబరిమల యాత్రలో విషాదం చోటుచేసుకుంది. చల్లపల్లి గ్రామానికి చెందిన ఆకుల నాగ విజయబాబు (40) గుండెపోటుతో కన్నుమూయటంతో చల్లపల్లి లో విషాదం నెలకొంది. రైస్ మిల్లో గుమస్తాగా పనిచేస్తున్న విజయబాబు అయ్యప్పస్వామి దర్శనానికి సహచర అయ్యప్ప దీక్షా పరులతో కలిసి శబరిమల వెళ్లాడు. పంబ దాటి బుధవారం తెల్లవారు జామున శరం గుత్తి వద్ద నడుస్తూ గుండెపోటుతో కుప్పకూలి పోయాడు. తోటిస్వాములు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకు వెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి తల్లిదండ్రులు, భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

లైంగిక వేధింపులపై కఠిన చర్యలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): పని ప్రదేశాల్లో మహిళల్ని లైంగిక వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని, లైంగిక హింసను తీవ్రమైన నేరంగా చట్టాలు పరిగణిస్తాయని ప్రముఖ కార్పొరేట్ ట్రైనర్ ఎం.యోగిత అన్నారు. యుజిసి మహిళా అధ్యయన కేంద్రం, కాన్సెప్ట్ ఆఫ్ లివింగ్ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కె.బి.ఎన్. కళాశాలలో లైంగిక వేధింపుల నివారణ (పోష్) చట్టం-2013 పై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న యోగిత మాట్లాడుతూ కళాశాల దశలో విద్యార్థినులు ఎక్కువగా లైంగిక హింసకు గురవుతున్నారని, వీటి నుంచి రక్షణ పొందే దుకు విద్యార్థినులు కూడా చట్టాల పైఅవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థినీ విద్యార్థులు పరస్పరం గౌరవ మర్యాదలతో ప్రవర్తించాలన్నారు. తమతో అసభ్యంగా ప్రవర్తించే వారి గురించి కాలేజీలో అధికారులకు, ఇంట్లో తల్లిదండ్రులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. ఎటువంటి అభద్రతకు విద్యార్థినులు గురికావద్దని, అనవసర భయాందోళనల వల్ల డిప్రెషన్ వంటి మానసిక వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. చట్టాలు, న్యాయస్థానాలన్నీ మహిళలకు అండగా నిలుస్తాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థినుల భద్రత కోసం తమ కళాశాలలో సిసి కెమెరాల ద్వారా నిరంతర నిఘా వ్యవస్థ పనిచేస్తుందన్నారు. విద్యార్థినులు తమకు ఎటువంటి అభద్రత, అసౌకర్యం కలిగినా వెంటనే అధ్యాపకులు, ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకురావాలన్నారు. హిందూ హై స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, మహిళా అధ్యయన కేంద్ర బాధ్యులు కె.స్వాతి, కె.వనమాదేవి పాల్గొన్నారు.

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ చిన్న మొత్తంతో సంపద

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సంపద సృష్టించడానికి చిన్న మొత్తంతో పెట్టుబడి ప్రారంభించడం, స్థిరంగా పెట్టుబడి కొనసాగించడం, క్రమశిక్షణతో ఉండటం అవసరం. నేటి ఆర్థిక రంగం ఎంచుకునేం దుకు ఎన్నో ఎంపికలు అందిస్తోంది. వాటిలో ప్రముఖమైనది సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ (ఎస్ఐపి) ద్వారా మ్యూచువల్ ఫండ్స్ సంపద పెంచుకోవడానికి ఒక శక్తి మంతమైన, సులభ విధానం. నేటి ప్రపంచంలో దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలు సాధించడం, ముఖ్యంగా పరిమిత వనరులతో మొదలుపెట్టడం భయంగొల్పుతుంది. ఈ పరిస్థితుల్లో సులభతరమైన, ప్రభావవంతమైన చక్కని ఎంపికగా నిలుస్తాయి. ఉదాహరణకు సగటు వార్షిక రాబడి రేటు 12.62 శాతం ఉంటుందనే అంచనాతో ప్రతినెలా రూ.5వేల చొప్పున ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడి పెడితే అది 12 ఏళ్లకు రూ.15.88 లక్షలవుతుంది. అదే 30 ఏళ్లు అయితే రూ.1.73 కోట్లకు పెరుగుతుంది. అతి స్వల్పమొత్తం నెలకు రూ.500లతో పెట్టుబడి పెట్టే అవకాశాన్ని ఎస్ఐపికల్పిస్తాయి. సంపద సృష్టికి ప్రారంభంలోనే పెద్ద మొత్తం అవసరమనే అపోహలను ఇది పటాపంచలు చేస్తుంది.

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆకస్మిక దాడులు

విశాలాంధ్ర-నంది గామ : ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్మెంట్ విజయవాడ శ్రీనివాస చౌదరి ఆదేశాల మేరకు కె.వి సుధాకర్ ఇన్స్పెక్టర్ వారి ఆధ్వర్యంలో సిబ్బంది నందిగామ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల పెద్దవరం గ్రామంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడులలో రామిశెట్టి రాము, శెట్టి వెంకట రమణ అనే వ్యక్తులకు చెందిన 173 తెలంగాణ మద్యం బాటిల్స్‌ను స్వాధీన పరుచుకొని, కేసులు నమోదు చేసి స్టేషన్ కి అప్పగించారు. ఈ దాడుల్లో సబ్ ఇన్స్పెక్టర్ ఎస్‌వి రామశేషయ్య, సుబ్బారావు వారి సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

లింగ సమానత్వ చట్టాలు పై సదస్సు

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : నేడు ఉన్న పితృస్వామ్య కుటుంబ వ్యవస్థలో లింగ సమానత్వ చట్టాలు వలన మహిళపై మరింత హింసకు గురి అవుతున్నారని వాటిని సంఘీటితంగా ఉద్యమించి చైతన్యం తీసుకు రావలసిన అవసరం ప్రతి మహిళపై ఉందని పలువురు పిలుపు నిచ్చారు. బుధవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మహిళా చైతన్య సంఘం (సిఎంఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు లక్ష్మి 20వ వర్ధంతి సందర్భంగా సమ సమాజంలో లింగ సమానత్వ చట్టాలా అనే దానిపై సదస్సు నిర్వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన సిఎల్‌సి జనరల్ సెక్రటరీ చిలకా చంద్రశేఖర్ మాట్లాడుతూ మద్యం వద్దు, మంచినీళ్లు కావాలని స్థానిక మహిళలను కూడగట్టినందుకు వేంపేటలో దళితులపై అగ్రవర్ణ భూస్వాములు చేసిన హత్య కాండను వ్యతిరేకిస్తూ, వారికి మద్దతుగా ఉండి నందుకు, పీడిత మహిళల హక్కుల కొరకు వారి విముక్తి కొరకు పోరాటం చేసిందన్నారు. గృహహింస వలన ఆత్మహత్యలు చేసుకుంటున్న మహిళల సంఖ్య ఎక్కువగా ఉందని, సనాతన మనుధర్మ శాస్త్ర ప్రకారం మహిళలపై హింస సమాజం ఆమోదించే హింసగా మారిపోయిందని, అందువలన భార్యలను భర్తలు కొట్టడం భార్యలను, భర్తలు కొట్టడం తప్పు కాదని అన్నారు. ప్రజలు నేటికీ భావిస్తు న్నారని, కోర్టులు, పోలీసులు కూడా అదే వైఖరితో ఉండటం ఆశ్చర్యకరమన్నారు. బిజెపి ప్రభుత్వం 498ఎ(84) చట్టానికి స్టేషన్ బెయిల్ ఇవ్వటమే కాకుండా, దర్యాప్తు పేరట కొన్ని లింగ పేరిట నిందితులను తప్పిస్తున్నారని, ఈ కేసులను నీరు కార్చాలని బిజెపి చూస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం మొత్తంగా రాజ్యాంగాన్ని ఎత్తివేసే చర్యలు తీసుకుంటుంద న్నారు. చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ అమ్మి శెట్టి రాధా అమ్మిశెట్టి రాధా మాట్లాడుతూ నేడు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల పేదలు మరింత పేదలుగా మారుతున్నారన్నారు. 498ఎ(84)పై వ్యతిరేక ప్రచారాన్ని అడ్డుకోవాలని పిలుపునిస్తూ చట్టం దుర్వినియోగం అవుతు ందని ప్రచారంలోని వారసత్వాలపై మరింత అవగాహన అందించటానికి ప్రతి జనవరి లక్ష్మీ వర్ధంతి సందర్భంగా ఇటువంటి సదస్సులు నిర్వమించి చైతన్యం తీసుకురావటా నికి కృషి చేస్తున్నామన్నారు. దీనిపై ప్రతి ఒక్కరు అప్రమ త్తంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ప్రగతిశీల మహిళా సంఘం నుండి పద్మ,చైతన్య మహిళా సంఘం సభ్యురాలు నల్లూరి క్రాంతి,తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పై నీటి సంఘాల అధ్యక్షులు సహకరించాలి

విశాలాంధ్ర – ఘంటసాల: రైతు సమస్యల పరిష్కారానికి నీటి సంఘాల అధ్యక్షులు సహకరించాలని శ్రీకాకుళం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ అయినంపూడి భాను ప్రకాష్ అన్నారు. ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళంలో గల నీటి పారుదల శాఖ సెక్షన్ కార్యాలయంలో బుధవారం భాను ప్రకాష్ అధ్యక్షతన నీటి సంఘాల అధ్యక్షులు, అధికారులతో సమావేశాన్ని నిర్వహి ంచారు. తానేటి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నీటి పారుదల శాఖ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, డ్రైనేజీ డీఈ జే బాబునాయక్ లు తమ శాఖల ద్వారా నీటి సంఘాలకు కల్పిస్తున్న సౌకర్యాలు, నిధుల వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు నీటి సంఘాల అధ్యక్షులు తమ పరిధిలో గల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. శ్రీకాకుళం డిసి పరిధిలోని కెఈబీ కెనాల్ పరిధిలోని యనమలకుదురు నుంచి నిమ్మగడ్డ లాకుల వరకు 54 కిలోమీటర్ల వరకు, 2,3,4,5 నెంబర్ల కాలువల పరిధిలో గుర్రపు డెక్క, నాచు, గుబీ, తూటుకాడ తొలగింపుకు రూ.89.48 లక్షల నిధులతో పనులు జరుగుతు న్నట్లు చైర్మన్ భాను ప్రకాష్ తెలిపారు. డిసి వైస్ చైర్మన్ సుగ్గున రాంబాబు, డ్రైనేజీ జేఈ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో వ్యక్తి హత్య

విశాలాంధ్ర-మచిలీపట్నం: మచిలీపట్నంలో వ్యక్తి పై కత్తితో దాడి జరిగిన సంఘటనపై ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో చిలకలపూడి పాండురంగ స్వామి దేవాల యం ప్రాంతంలో అడపాల రవి(55) అనే వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. అతని బంధువులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రమైన మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తీసుకుని వెళ్లగా చికిత్స పొందుతూ రవి మృతి చెందాడు.

పథకం ప్రకారమే హత్య చేసిన దుండగులు : పక్కా ప్రణాళికతో హత్య చేయడానికి గుర్తు తెలియని దండగులు కత్తి, కారంతో రవి నివాసం వద్ద రెక్కీ నిర్వహించి కాపు కాశారు. అక్కడే ఉన్న సీసీ కెమెరాలకు ఉన్న వైరును కోసి కెమెరాలో రికార్డు అవ్వకుండా జాగ్రత్త పడ్డ దుండగులు, సేకరించిన సమాచారం ప్రకారం అడపాల రవి చిలకలపూడి పాండురంగ స్వామి గుడివద్ద నివాసముంటున్నాడు. ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ జీవన సాగిస్తూ ఉన్నాడు. ఇతని భార్య కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఒక కుమార్తె బీటెక్ చదువుకొని ప్రైవేటు ఉద్యోగం జాబు ట్రైల్స్‌లో ఉంది. ఇటీవల రవి మచిలీపట్నం మండలం పోతేపల్లి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ భార్యతో అక్రమ సంబంధం నేపథ్యంలో లారీ డ్రైవర్ రవిని హతమార్చాలని తన దగ్గర పనిచేసిన ముగ్గురు(ఇద్దరు మాజేరు గ్రామానికి చెందిన వ్యక్తులు ఒకరు పోతేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి) వ్యక్తులతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. లారీ డ్రైవర్ తన దగ్గర పనిచేసిన ముగ్గురు వ్యక్తులు బాసు రుణం తీర్చుకోవాలని ఎప్పటినుంచి ఎదురుచూస్తున్న ఈ ముగ్గురు మంగళవారం అర్ధరాత్రి సమయంలో ముందే వేసుకున్న ప్రణాళిక ప్రకారం రెండు కత్తులు కారప్పొడితో రవి ఇంటి ఎదురుగా కాపు కాసి ఇంటి వద్ద కత్తితో పొడిచి అక్కడి నుండి దుండగులు పరారైనట్లు సమాచారం. రక్తం మడుగులో ఉన్న రవిని బంధువులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూమృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న చిలకలపూడి సీఐ నబి తెలిపారు.

ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: స్థానిక గుడ్లవల్లేరులోని వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగాయి. ప్రతి సంవత్సరం సీనియర్స్‌కి జూనియర్స్‌కి మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పాలని ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మణరావు తెలిపారు. సీనియర్స్ జూనియర్స్ కి తమ విలువైన సూచనలను సలహాలను అందించి వారికి సరైన మార్గం నిర్దేశించ వలసిందిగా కోరారు. విద్యార్థులంతా ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని అంకితభావం క్రమశిక్షణ శ్రమతో కూడిన కృషిని ఆయుధాలుగా చేసుకొని ఆ లక్ష్యాన్ని చేదించాలని విద్యార్థులకు సూచించారు. భవిష్యత్తులో అంచెలంచలుగా ఎదిగి ఎన్నో ఉన్నత విజయాలను సాధించి తమ కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. అనంతరం ఈ కార్యక్రమం బీఫార్మసీ రెండవ సంవత్స రం చదువుతున్న రోహిణి సాంప్రదాయక నృత్యంతో ఆరంభిం చారు. తరువాత మొదటి మరియు రెండవ సంవత్సర విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు అందరినీ అలరించాయి. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు కొన్ని సరదా కార్యక్రమాలు నిర్వహించారు. చివరగా జూనియర్ విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ తో పాటు అధ్యాపకులు డాక్టర్ ఎస్ కె. అమినాబీ, డాక్టర్ పి.రవిష, డాక్టర్ టి. ప్రశాంతి, డాక్టర్ టి. బాలకృష్ణ, బి. సత్య శ్రీ, టి. శ్రావణి, వి.ఎల్. వినోద్ కుమార్, డాక్టర్ ఎ సాయి ధాత్రి, కె. పరిమళ, డాక్టర్ వి. రజని తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న రామ్‌సింగ్

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియం త్రణ మండలి చైర్మన్ ఠాగూర్ రామ్ సింగ్, సభ్యులు వెంకట రామి రెడ్డి కనకదుర్గ అమ్మ వారిని దర్శించుకున్నారు. విజ యవాడలో రెండు రోజులపాటు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియం త్రణ మండలి బహిరంగ ప్రజాభిప్రాయసేకరణ కార్యక్రమం బుధవారం ముగిసించుకుని సాయంత్రం కనకదుర్గ అమ్మవారిని హారతుల సమయంలో దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బాయ్ చైర్మన్‌గా మాటూరి

విశాలాంధ్ర- విజయవాడ: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) అమరావతి క్యాపిటల్ సెంటర్ చైర్మన్‌గా గుడివాడ అమ్మకన్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత మాటూరి రంగనాథ్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నాగ మల్లేశ్వర రావు బుధవారం ప్రకటించి ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్ సత్యనారాయణ, కోశాధికారిగా కెపి కిరణ్, ఉపాధ్య క్షులుగా పట్నాయక్, రాజేష్, సంయుక్త కార్యదర్శిగా వి.వెంకట నారాయణ ఎన్నికయ్యారు. నూతన చైర్మన్ మాటూరి రంగనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగ సమస్యల పట్ల సానుకూలంగా ఉండటం పరిశ్రమకు కలిసి వచ్చే అంశంగా మారిందన్నారు. ఏపీ చాం బర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు అధ్యక్షత వహించగా, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రమేష్, అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డి. పంకజ్ రెడ్డి, నారెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు జి. చక్రధర్, బాయ్ రాష్ట్ర అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు, పాల్గొన్నారు.

కలంకారీ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : కలెక్టరేట్‌లో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, పెడన కలంకారి ఆర్టిజాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిదులతో కలిసి బుధవారం జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ ని కలిసారు. పెడనలో ఏర్పాటు చేయనున్న కలంకారీ క్లస్టర్ గురించి చర్చించారు. ఈ నెల రెండో తేదీన జిల్లా కలెక్టర్ పెడనలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించగా బుధ వారం శాసనసభ్యుని ఆధ్వర్యంలో కలంకారి ఆర్టిజాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు క్లస్టర్ ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవా లని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్. వెంకట్రావును ఆదేశిం చారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణు గోపాలరావు, పెడన కలంకారి ఆర్టిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బళ్ళ ప్రసాద్, కార్యదర్శి జంపాల శ్రీనివాస్, అడ్వైజర్ రవి, తహసీల్దార్ అనీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ లెవెల్‌లో మ్యాన్‌హోల్ మూతలు

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలోని అన్ని మ్యాన్‌హోల్ మేతలను రోడ్ లెవల్‌లో ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కమిషనర్ పర్యటనలో భాగంగా 23వ డివిజన్ కార్పొరేటర్ బాలస్వామితో కలిసి బుధవారం ఆ డివిజన్‌లోని ప్రజల సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బిసెంట్‌లోని మహంతి మార్కెట్, కర్నాటి రామ్మోహన్‌రావు స్కూల్, చలసాని వెంకటరత్నం వీది, ప్రకాశం రోడ్డు, పొగాకు బారెల్ రోడ్డు, కాళేశ్వరం రోడ్డు, ఐవీ ప్యాలెస్ ప్రాంతాల్లో పర్యటించారు. కర్నాటి రామ్మోహన్ రావు స్కూల్‌లో కూలిపోయిన ప్రహరీ గోడను నిర్మించాలని సిఇ, ఎస్సీలను ఆదేశించారు. డివిజన్‌లోని చలసాని వెంకటరత్నం వీది, ప్రకాశం రోడ్డు, పొగాకు బారెల్ రోడ్డు, కాళేశ్వరం రోడ్డు, ఐవీ ప్యాలెస్‌లో సెల్లార్‌లో ఉన్న ఫర్నిచర్ తొలిగించాలని ఆదేశించారు. ఉమెన్స్ హాస్టల్ ప్రహరీ గోడ నిర్మాణం వెంటనే చేపట్టినందుకు కమిషనర్‌కు కార్పొరేటర్ ధన్యవాదాలు తెలిపారు. బీసెంట్ రోడ్‌లోని ఫిష్ మార్కెట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను పరిష్కరి ంచాలని సీఈకి, ఎస్సీలను ఆదేశించారు. బీసెంట్ రోడ్‌లోని కమర్షియల్ బిల్డింగ్‌లపై వివరణ ఇవ్వాలని ఎస్టేట్ ఆఫీసర్‌కు సూచించారు. లెనిన్ సెంటర్‌లోని పార్కును పరిశీలించారు. ఈ కార్యక్రమంలోఎస్ఈ, శానిటరీ ఇనస్పెక్టర్, టౌన్ ప్లానింగ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలాంటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళిక-కమిషనర్ ధ్యానచంద్ర నగర ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్దం చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కమిషనర్ బుధవారం సీ.డీ.ఎమ్.ఏ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఏబిసి ఆపరేషన్లు, స్పాట్ హోల్ రిపేర్లు, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, అన్న క్యాంటీన్ నిర్వహణ, త్రాగునీటి సరఫరా తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు ఎటువంటి సమస్య రాకుండా ముందుగానే ప్రణాళి కలతో ఉండాలని అధికారులకు సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్ జి.సృజన, ఇంచార్జ్ సీఎంవోహెచ్ డా.సురేష్‌బాబు, ఎస్ఈ సత్యనారాయణ, ఇంచార్జ్ వెహికల్ డిపో ఈఈ ఏసుపాదం, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా.బిఎస్ఎస్.రెడ్డి పాల్గొన్నారు.

ఏపీ మెస్సా రాష్ట్ర అధ్యక్షుడిగా తిమ్మసర్తి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ఏపీఎంఈఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు, ఏపీఎంఈఎస్ఏ వీఎంసీ యూనిట్ నూతన అధ్యక్షుల ఎన్నికకు కార్యవర్గ సమావేశం నగరపాలక సంస్థ ఎంప్లాయిస్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం జరిగినది. ఈ సమావేశంలో ఏపీ మెస్సా రాష్ట్ర నూతన అధ్యక్షులుగా తిమ్మసర్తి నాగేశ్వరరావు, ఏపీ మెస్సా వీఎంసీ యూనిట్ జనరల్ సెక్రెటరిగా సలీంఅహ్మద్, యూనిట్ నూతన అధ్యక్షులుగా శ్యామ్ సురేంద్ర బాబును ఏకగ్రీవంగా ఎన్నుకుని అభినందించారు. ఈ సందర్భంగా శ్యామ్ సురేంద్రబాబు మాట్లాడుతూ నగరపాలక సంస్థ అందరు ఉద్యోగులకు, ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ విజయవాడ యూనిట్ అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు, రాష్ట్ర నాయకత్వానికి, ఎన్టీఆర్ జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఎపీ మెస్సా యూనిట్ నూతన అధ్యక్షునిగా నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టు కుంటూ ఉద్యోగుల సమస్యల సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపాను. ఈ కార్యక్రమములో ఏపీ మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ శివరామప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకృష్ణ దేవరాయలు, వీఎంసీ యూనిట్ జనరల్ సెక్రెటరి సలీంఅహ్మద్, ఉపాధ్యక్షులు రాంబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రకాష్‌సాగర్, ఆర్గనైజింగ్ సెక్రెటరి సురేంద్రకుమార్, పబ్లిసిటీ సెక్రెటరి మారుతీరావు, ట్రజరర్ ఉదయభాస్కర్, వైస్ ప్రెసిడెంట్స్ శారదా రాణి, వెంకటేశ్వరరావు, జయప్రభు, మూర్తి, సెక్రెటరీస్ మధుసూదానరావు, శుభకరరావు, కరుణ, జాయింట్ సెక్రెటరీస్ అహమ్మద్ అలీ, రాజశేఖర్, భాస్కరరావు, దీపక్‌కుమార్, సీత, టి.అరుణ, ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ షర్మిల, పద్మశ్రీ, శ్యామ్యూల్, దుర్గారావు, రవి పాల్గొన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినయోగిస్తే కఠినమైన చర్యలు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగరంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగంపై కఠినమైన చర్యలు తీసుకోనున్నట్లు అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ బాబుశ్రీనివాస్ తెలిపారు. స్థానిక సర్కిల్-3 పరిధిలోని పబ్లిక్ హెల్త్ సెక్షన్ అధికారులు, సర్కిల్-3 కార్యాలయంలో బుధ వారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబుశ్రీనివాస్ మాట్లాడుతూ శానిటరీ వర్కర్ల అటెండెన్స్, చెత్త తరలించే వాహనాల ట్రిప్పులు, వెయిటేజ్, చెత్త ఎక్కువగా పడే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి క్లీనింగ్, లిఫ్టింగ్ చేయటం, వాటిని నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, సింగల్ యూజ్డ్ ప్లాస్టిక్ నియంత్రణ, అపరాధ రుసుం, ట్రేడ్ లైసెన్సులు, యాంటి లార్వా యాక్టివిటీస్, స్వచ్ఛ సర్వేక్షన్ 2024కు సంబంధించిన విషయాలపై చర్చించి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్లు షేక్ సలీం, సోమరాజు, శానిటరీ, మలేరియా ఇనస్పెక్టర్లు, వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ కార్యదర్శిలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల శ్రమదోపిడీ

విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజా

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : సూర్యుడు ఉదయించక ముందే పారిశుధ్య పనులు చేపడుతున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికుల శ్రమను దోచుకోవటం ప్రభుత్వాలకు సరైంది కాదని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా అన్నారు. బుధవారం తెల్లవారు జామున 36వ డివిజన్ శానిటరీ కార్యాలయం, హనుమాన్‌పేటలోని 6వ మలేరియా కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం రూ.26 వేలకు తక్కువ కాకుండా వేతనాలివ్వాల్సి ఉందన్నారు. కానీ ప్రభుత్వాలు తమ వద్ద నిధులు లేవనే సాకుతో పారిశుధ్య కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ కనీస వేతనాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. పెరుగుతున్న నిత్య వసర ధరలు, కరెంటు బిల్లులు, ఇతర చార్జీలతో సామాన్యులు బతకటం కష్టతరంగా మారిందని, ప్రభుత్వాలు భారాలు మోపెందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నాయి కాని జీతాలు పెంచేందుకు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పారిశుద్ధ్య కార్మికుల జీతం రూ.26 వేలకు పెంచి చిత్తశుద్ధి చాటుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు చలం, సహాయ కార్యదర్శి తుపాకుల ప్రతాప్, కోశాధికారి తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మురికి కూపంగా కాలనీలు

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక పలు కాలనీలు మురికి కోపంగా మారుతున్నాయి. మురుగు నీరు పారుదల కాక చెరువులను తలపిస్తున్నాయి.ముఖ్యంగా మోడల్ కాలనీ, ఇందిరా కాలనీ,అరుంధతి నగర్ లలో డ్రైన్లు లేక నీరు నిలబడి దోమలకు అవాసా లుగా మారి దోమ కాటుతో ప్రజలు రోగాలు బారిన పడుతున్నారు. ముఖ్యంగా, పేద మధ్యతరగతి కుటుంబాల నివసించే ఇలాంటి గ్రామాల్లో డెంగ్యూ లాంటి ప్రమాదకర వ్యాధుల బారన పడి ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా కూడా నష్టపోతున్నారు. మోడల్ కాలనీ లాంటి ప్రాంతాలు ఊరికి దూరంగా ఉండటంతో అధికారులు కన్నెత్తైనా చూడడం లేదు.ఇలాంటి ప్రాంతాలలో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పరిస్థితులలో ఏలాంటి.మార్పు లేదు.గత ప్రభుత్వం లో నిధుల లేని కొరతతో కొట్టుమిట్టాడిన గ్రామపంచాయతీలు ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో నిధులు వస్తున్నప్పటికీ డ్రైనేజీల అభివృద్ధి పనులలో ఏమాత్రం పురోగతి లేదు.ఇప్పటికైనా అధికారులు స్పందించి కంచిక చర్ల పట్టణంలో మురుగు కాలవల ప్రక్కన ఇరువైపు లా డ్రైనేజ్ లను నిర్మించి మురుగు నీరు సక్రమంగా పారుదల అయ్యే విధంగా ఏర్పాటు చేసి, దోమలను నిర్మూలించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవలసిందిగా ప్రజలు కోరుకుంటున్నారు.

ఖోఖో ప్రపంచకప్ చీఫ్ రిఫరీగా కృష్ణా జిల్లా ఫిజికల్ డైరెక్టర్ మడక ప్రసాద్

విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్ : ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన ప్రముఖ ఫిజికల్ డైరెక్టర్, ప్రస్తుతం గుడివాడలోని శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో సేవలందిస్తున్న మడక ప్రసాద్ తొలి ఖో ఖో ప్రపంచకప్‌కు చీఫ్ రిఫరీగా నియమితులయ్యారు. జనవరి 13 నుండి 19, 2025 వరకు న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ జరగనుంది. ఈ మేరకు ఖో ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సుధాన్షు మిట్టల్, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ త్యాగీ ఒక సర్క్యులర్ జారీ చేశారు. చీఫ్ రిఫరీగా మడక ప్రసాద్ ఎంపిక కావడం తెలుగు రాష్ట్రాలకు, దేశానికే గర్వకారణం. అనేక జాతీయ క్రీడలలో చీఫ్ రిఫరీగా పనిచేసిన చరిత్రతో, అతను అనేక జాతీయ-స్థాయి ఛాంపియన్‌షిప్‌లతో పాటు ఆసియా ఖో ఖో ఛాంపియన్‌షిప్, దక్షిణాసియా ఖో ఖో ఛాంపియన్‌షిప్‌లలో కూడా రిఫరీగా సేవలందించారు. స్వతహాగా ఖో ఖో క్రీడాకారుడు అయిన ప్రసాద్, కృష్ణా జిల్లా నుంచి పలువురు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయడంతోపాటు వారికి ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నారు. ప్రసాద్ ప్రస్తుతం ఖో ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా యొక్క కార్యనిర్వాహక సభ్యునిగా పనిచేస్తున్నారు. తొలి ఖో ఖో ప్రపంచ కప్ నిర్వహణ బాధ్యతను కేంద్ర ప్రభుత్వం ఒలింపిక్ సంఘం (అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పిటి ఉషకు అప్పగించారు. ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేయడంతోపాటు ప్రపంచ దేశాలకు భారత్ క్రీడా సత్తాను చాటి చెప్పాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. మడక ప్రసాద్ ఖో ఖో ప్రపంచ కప్ చీఫ్ రిఫరీగా నియమితులుకావడంపై గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కృష్ణా జిల్లా ఖో ఖో సంఘం చైర్మన్ యలవర్తి శ్రీనివాస్, కార్యదర్శి మద్దినేని వెంకట సత్య ప్రసాద్, కృష్ణా జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ షేక్ జాన్, గుడివాడ డీవైఈవో పద్మారాణి, పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సొంటి కృష్ణ శ్రీనివాస్ తదితరులు అభినందించారు. ఇదిలావుండగా, ఈ సందర్భంగా ఖో ఖో ప్రపంచ కప్ చీఫ్ రిఫరీ మడక ప్రసాద్ మాట్లాడుతూ, ఇది తనకు గొప్ప గౌరవమన్నారు. వివిధ దేశాల నుండి అత్యంత ప్రతిభావంతులైన జట్లు ఈ టోర్నమెంట్‌లో పోటీపడతాయని, అలాంటి టోర్నమెంట్‌కు చీఫ్ రిఫరీగా తన బాధ్యతలను సమర్థంగా నెరవేర్చడానికి కట్టుబడి ఉంటానన్నారు. తనకు ఈ ప్రతిష్టాత్మకమైన పాత్రను అప్పగించినందుకు ఖఖఫీ× అధ్యక్షుడు సుధాన్షు మిట్టల్ మరియు ప్రధాన కార్యదర్శి త్యాగికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ ఆహార పదార్థాల ప్రదర్శనే లక్ష్యం

ఇండస్‌ఫుడ్ '2025'లో తెనాలి డబుల్ హార్స్ గ్రూప్

విశాలాంధ్ర - విజయవాడ లబ్బీపేట : ఢిల్లీ ఇండియా ఎక్స్‌పోజిషన్ మార్ట్‌లో జరిగిన 'ఇండస్‌ఫుడ్ 2025'లో ప్రీమియం వంట సామాగ్రి ఉత్పత్తుల్లో అగ్రగామి తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ పాల్గొంది. ఈ ఎక్స్‌పో జనవరి 8న ప్రారంభమైంది. ఈనెల 10వ తేదీ వరకు జరగనుంది. ఈ ఎక్స్‌పోలో 20 దేశాల నుంచి ఆహార ప్రాసెసింగ్ సంస్థలు, 1,800 పైగా ప్రదర్శకులు, 5,000 పైగా అంతర్జాతీయ కొనుగోలుదారులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ఆహార పదార్థాలను ప్రపంచానికి పరిచయం చేయడంలో ఈ వేదిక కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఇండస్‌ఫుడ్ మన గ్రామీణ ఆహార సంస్కృతి గొప్పతనాన్ని, సంప్రదాయాలను ముందుకు తీసుకువెళ్ళే అవకాశాన్ని అందిస్తుందని చెప్పారు. ఇది మన గ్రామీణ వైద్యాన్ని గ్లోబల్ మార్కెట్లకు తీసుకువెళ్ళే ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. గత రెండేళ్లుగా ఇండస్‌ఫుడ్‌లో పాల్గొంటున్నామని తెలిపారు. ఆరోగ్యంపై మక్కువ కలిగిన వినియోగదారులు, భోజనప్రియులను ఆకట్టుకునే ఉత్పత్తులను ఈ అంతర్జాతీయ వేదిక ద్వారా ప్రదర్శించామని చెప్పారు. గ్రామీణ ఆహారాన్ని, పోషక విలువను అంతర్జాతీయ భోజనాల్లోకి తీసుకురావడమే మా లక్ష్యమని తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటుంది. నాణ్యత, నమ్మకం, సామాజిక బాధ్యత పట్ల దృఢ నిబద్ధతతో తెనాలి డబుల్ హార్స్ పరిశ్రమలో కొత్త ప్రమాణాలను సృష్టిస్తుంది. మరింత సమాచారం కోసం 9963980259/ 9985310069 సంప్రదించండి .

ముగిసిన ఓజేటి శిక్షణ

విశాలాంధ్ర - కూచిపూడి : మొవ్వక్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్కళాశాల ఇంటర్మీడియట్. రెండు సంవత్సరాల ఒకేషనల్ విద్యార్థులకు ఆన్ ది జాబ్ ట్రైనింగ్ కార్య క్రమం బుధవారంతో ముగిసింది. అకౌంటింగ్, టాక్సేషన్ విభాగంలో రెండు సంవత్సరాల లోనే 44 మంది విద్యార్థులకు మొవ్వ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో, మండలాభివృద్ధి అధికారి కార్యాలయంలో ఆఫీస్ అసిస్టెంట్ షిప్ విద్యార్థులు రెండు సంవత్సరాల్లోని 36 మందికి సబ్ ట్రెజరీ కార్యాలయం, ఐసిడిఎస్ కార్యాలయం, ఎంఏటి రెండు సంవత్సరాల విద్యార్థులు 41 మందికి మచిలీపట్నంలోని సుధా గోల్డ్ కవరింగ్ ఫ్యాక్టరీ కేంద్రాలలో శిక్షణ పొందారు .31రోజుల పాటు శిక్షణ పొందిన విద్యార్థుల స్థితిగతులను కళాశాలప్రిన్సిపాల్ కేవివిఎస్. ప్రసాదశాస్త్రి ముగింపు రోజున ఆయా కార్యాలయాలలో పరిశీలించి శిక్షణ పొందిన వివరాలను సేకరించారు. మొవ్వ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జే విమాదేవి ద్వారా దీనికి సంబంధించిన వివరాలను తెలుసుకొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలకు ఎంతో ఉపయోగపడు తుందని పేర్కొన్నారు. ఓ.జే.టి. శిక్షణ పొందిన ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలలో 100 మార్కులు కేటయించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.రంగనాయకులు, బి.గౌరమ్మ, సిహెచ్. ఆనంద్, ఆర్.విజయభేరీ, ఏ. వాసు బాబు, ఎం.ఆనందరావు శిక్షణను ఇచ్చిన కార్యాలయాలలో పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రేడాయ్ ప్రాపర్టీ షో..

- ప్రారంభించనున్న మంత్రి లోకేష్...
- విజయవాడ చాప్టర్ అధ్యక్షుడు దాసరి రాంబాబు..

విశాలాంధ్ర - విజయవాడ లబ్బీపేట : రియల్ ఎస్టేట్ రంగ నిపుణులు, వినియోగదారులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రడాయి విజయవాడ ప్రాపర్టీ షో ఈనెల 10వ తేదీ నుండి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు క్రెడాయి విజయవాడ చాప్టర్ అధ్యక్షుడు దాసరి రాంబాబు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన ప్రాపర్టీ షోను మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ప్రారంభ మవుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగానికి నూతన ఉత్తేజం కలిగించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమన్నారు. బిల్డింగ్ నియమాలు సులభతరం చేయడం, ఇసుక ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు బిల్డర్ల సూచనలకు విలువిస్తున్న ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమ చాప్టర్ ఆధ్వర్యంలో గడిచిన 12 సంవత్సరాలుగా ప్రాపర్టీ షోలను నిర్వహిస్తున్నామని ఈనెల పదవ తేదీ నుండి మూడు రోజులపాటు నగరంలోని ఏ కన్వెన్షన్ సెంటర్లో పదవ ప్రాపర్టీ షో నిర్వహించబోతున్నట్లు చెప్పారు. సొంత ఇంటి కల ప్రతి మధ్యతరగతి వాడి కలని ఆ కలను సహకారం చేసుకునే క్రమంలో ఈ ప్రాపర్టీ షో లో ఉన్న 50 ఇష్టాలు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు. దేశంలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న విజయవాడ నగర పౌరులందరూ ఈ ప్రాపర్టీ షాప్ కోసం ఆశగా ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. గృహపుకరణాలకు సంబంధించిన అన్ని వస్తువులు ఒకే సముదాయంలో లభించడం అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వి శ్రీధర్ కోశాధికారి టి వంశీకృష్ణ కన్వీనర్ కే రఘురాం మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - పమిడిముక్కల : వ్యక్తి నిత్య జీవితంలో కళ్ళుకి ప్రాముఖ్యత ఇవ్వాలని డాక్టర్ యం.కిర్మణ్మయి అన్నారు. బుధవారం విజయవాడ వారి శ్రీ నయన కంటి వైద్యశాల సిబ్బంది ముళ్ళపూడి ఐనంపూడి వేల్పూరు హనుమంతపురంలో ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.సుందరాం మాట్లా డుతూ సదరు గ్రామాల్లో 200 మందికి కంటి పరిక్షలు నిర్వహిం చామని 30 మందికి శుక్లాల ఆపరే షన్ అవసరం ఉందని వారి తేది ప్రకటించి ఆపరేషన్లు చేస్తామ న్నారు. మందులు ఉచితంగా అంద˘చేశారు. ఈ కార్యక్రమంలో సదరు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను మెరుగుపర్చండి

విశాలాంధ్ర - విస్సన్నపేట టౌన్: నరేగా పథకం ద్వారా పేద లకు

ఉపాధి అవకాశాలను మెరుగు పర్చాలని విస్సన్నపేట ఎంపీడీవో సిహెచ్.చిన్నరాట్నాలు సూచించారు. విస్సన్నపేట, తిరువూరు, రెడ్డిగూడెం మండలాలకు చెందిన నరేగా పథక క్షేత్ర సిబ్బందికి విస్సన్నపేటలో బుధవారం శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో చిన్నరాట్నాలు, నరేగా ఏపీడీ పార్థసారథిలు కనీస వేతనం అందేలా తీసుకోవలసిన చర్యలు, ఫోన్ ద్వారా హాజరు నమోదు విధానాలు, శ్రమశక్తి సం ఘాల ఏర్పాటు తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు ఆయా మండలాల ఏపీవోలు మున్నీ, సురేష్, దాసు, రామారావు, నాగమురళి తదితరులు పాల్గొన్నారు.

కిషోరి వికాసంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - పెదపారుపూడి : మండలంలోని యలమర్రు, పెదపారుపూడి, వాన పాముల, వెంట్రప్రగడ, దోసపాడు, గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్‌లు అరుణ కుమారి, శివ నాగమణి ఆధ్వర్యంలో కిషోరి వికాసంపై బాలికలకు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. పెదపారుపూడి జడ్పీహెచ్ఎస్‌లో జరిగిన కార్యక్ర మంలో ఎంపీడీవో టి సీతామహాలక్ష్మి ముఖ్యఅతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కిషోరి బాలికలలో రక్తహీనత, బాల్య వివాహాల నివారణ, బాలికల అక్రమ రవాణా, లైంగిక వేధింపుల నుండి రక్షణ, లింగ వివక్ష, నైపుణ్య ఉపాధి, తదితర అంశాలపై కిషోరి బాలికలకు అవగాహన కల్పించినట్లు సూపర్వైజర్‌లు ఒక ప్రకటనలో వివరించారు. అనంతరం బాల్యవివాహాల నివారణపై ప్రతిజ్ఞ చేయించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, అంగనవాడి సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



విశాలాంధ్ర - విజయవాడ రూరల్ : తినే ఆహారం కూడా రసాయనాలతో విషపూరితమై పోతున్న ఈ రోజుల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పాత్రికేయులు ఆర్. అప్పాజీ అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతున్న తరుణంలో మన ప్రాచీన విధానాలను పరిరక్షించు కోవాలన్నారు. 35వ పుస్తక మహోత్సవం ఏడవ రోజు బుధవారం రామోజీరావు సాహిత్యవేదికపై నిర్వహించిన కార్యక్రమం లో వాచకం ప్రచురణలకు చెందిన "ప్రకృతి వ్యవసా యం - పాలేకర్ విధానం" పుస్తకాన్ని పాత్రికేయ వృత్తి మిత్రులు ఆవిష్కరించారు. ఆకుల అమరయ్య, రఘు రామయ్య, చిగురుపాటి సతీష్, అక్బర్ పాషా తదితర పాత్రికేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్తదనం కోసం, అభివ్యక్తి కోసం తపిస్తున్న కవి శ్రీనివాస గౌడ్ తనదైన అభివ్యక్తికోసం తపించి, సాధించిన యువ కవుల్లో శ్రీనివాస్ గౌడ్ అగ్రగణ్యుడని ప్రముఖ కవి ఖాదర్ మొహియుద్దీన్ అన్నారు. సాహిత్యవేదికపై నిర్వహించిన అయిదో కార్యక్రమంగా పి. శ్రీనివాస గౌడ్ రాసిన అంబపలుకు కవితాసంపుటిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కవిత్వ భాషను, అందులో తనదైన శైలినీ, బహుళార్థకతనూ సాధించడానికి ఎంతో ప్రతిభ, కృషీ అవసరమన్నారు. అధ్యక్షత వహించిన బండ్ల మాధవరావు మాట్లాడుతూ రచయిత శ్రీనివాస్ గౌడ్ సాహితీరంగంలో వేగంగా ఎదుగుతూ, తనదైన గుర్తింపు సాధిస్తున్నా డని చెప్పారు. వివిధ ప్రపంచ భాషల కవిత్వాన్ని తెలుగులోకి తేవడంలో ఆయన కృషి ప్రశంస నీయమైనది. కవితా రచన, కథా రచన, సాహితీ విమర్శ, కవితానువాదం తదితర రంగాలలో శ్రీనివాస గౌడ్ కృషి ఎన్నదగినదన్నారు. డా. సుంకర గోపాల్ పుస్తకాన్ని సమీక్ష చేస్తూ సమాజంలోని ఎనిమిది కీలకాంశాలపై శ్రీనివాస్ గౌడ్ ప్రభావవంతంగా కవితలను సృజించార న్నారు. కవిత మొదటి పదం నుంచి చివరి వరకూ స్థిరమైన ఆలోచనాధారను వెలువరించడం కవి విజయవంతమయ్యాడని వివరించారు. యాకూబ్, సత్యాజీ, శాంతిశ్రీ, పద్మకళ, కలిమిశ్రీ, పి. శ్రీనివాస్ గౌడ్ ప్రసంగించారు.

బౌద్ధ మ్యూజియంను సందర్శించిన ఎన్నారై వెంకట్రావు

విశాలాంధ్ర - ఘంటసాల: ప్రవాస భారతీయుడు మాల్పూరి వెంకట్రావు ఆంధ్ర ప్రదేశ్ నాటక కళాపరిషత్ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ ఘంటసాల లోని బౌద్ధ మ్యూజియంను బుధవారం సందర్శించారు. బౌద్ధ మ్యూజియంలో క్రీస్తు శకం 2-3 శతాబ్దాల్లోని బౌద్ధశిల్ప సంపదను వారు పరిశీలించారు. ప్రాచీన కాలంలో ఘంటసాల పరిసర ప్రాంతాల్లో బౌద్ధం విరాజిల్లిందని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ వారికి వివరించారు. మొదట బౌద్ధ స్తూపం చుట్టూ ప్రదక్షిణలు జరిపారు. అనంతరం ఘంటసాల ,దేవరకోట ఇలవేల్పు అయిన కోట ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.

విద్యార్థులు చిత్తశుద్ధి, క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ఇంటర్న్‌షిప్ అవకాశాలను వివరిస్తున్న డాక్టర్ రమేష్

విశాలాంధ్ర- కంచికచర్ల : 21వ శతాబ్దపు విద్యార్థులు చరిత్ర సృష్టించే వారుగా తయారవ్వాలని, ప్రతి ఒక్కరు తమలో నిబిడీకృతమై యున్న శక్తియుక్తులను ఉపయోగించుకొని తమ ఉన్నత లక్ష్యాలను అందుకోవడానికి ప్రయత్నించాలని, హైదరా బాద్‌లోని సెంటర్ ఫర్ హ్యూమన్ సెక్యూరిటీ సర్వీస్ డైరెక్టర్ డాక్టర్ కన్నిగంటి రమేష్ అన్నారు. కంచికచర్లలోని మిక్ ఇంజినీ రింగ్ కళాశాల బి.టెక్ మూడవ సంవత్సరం విద్యార్థిని విద్యార్థు లను ఉద్దేశించి బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రమేష్ మాట్లాడారు. విదేశీ విశ్వ విద్యాలయాలలో ఉచిత ఉన్నత విద్య,సివిల్ సర్వీసెస్ పరీక్షలలో ఉత్తీర్ణత, ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందిపుచ్చుకోవడం ఎలా అనే అంశాల గురించి ఆయన వివరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చిత్తశుద్ధి, క్రమశిక్షణ మరియు ధృడ సంకల్పం అనే లక్షణాలను అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో సీఈవో పాండురంగారావు, మేనేజ్ మెంట్ మెంబర్ ఎం. సుహాస్, ప్రిన్సిపల్ డాక్టర్ టి. వంశీ కిరణ్, ట్రైనింగ్ హెడ్ డాక్టర్ జి. అశోక్ వర్ధన్ పాల్గొన్నారు.

సీడ్ బాల్స్ తయారీపై అవగాహన

విశాలాంధ్ర-యడ్లపాడు : రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సీడ్ బాల్స్ తయారీపై అవగాహన కల్పించారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు, అవగాహన కార్యక్రమం కో-ఆర్డినేటర్ రొటేరియన్ దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వివిధ పద్ధతుల్లో విత్తన సేకరణ జరపాలన్నారు. రెండు లేదా మూడు విత్తనాలను కొద్దిగా మట్టి ఎరువుతో కలిపి బంతిలా చేసి వాటిని నీడలో ఆరబెట్టి భద్రపరచాలని వివరించారు. వర్షాకాలం ఆరంభంలో కొండ ప్రదేశాలలో బంజర భూములలో వీటిని చల్లితే మొక్కలై వృక్షాలుగా ఎదుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఆళ్ల వేమనరెడ్డి, ఎంఇఒ అరుణకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏవీ నాయుడు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

రేపు శ్రీకాకుళేశ్వర స్వామి ఉత్తర ద్వార దర్శనం

విశాలాంధ్ర - ఘంటసాల : మండల పరిధిలోని శ్రీకాకుళంలో వేంచేసి ఉన్న (ఆంధ్రమహావిష్ణు) శ్రీకాకుళేశ్వర స్వామి వారు రేపు 11:16 ని"కు ఉత్తర దార దర్శనం ద్వారా భక్తులకు దర్శనం ఇస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 4 గం"కు సహస్రనామార్చన , 04 -08 ని"లకు ఆస్థాన పూజా కార్యక్రమం 10 - 16 నిలకు స్వామివారు ఉత్తర ద్వారా దర్శనం ద్వారా భక్తులు దర్శనం. అనంతరం గరుడ వాహనంపై గ్రామోత్స వం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 1 - 00 గం"కు స్వామివారి తీర్థ ప్రసాద వినియోగము. సాయంత్రం 6-00 నిత్య పూజా కార్యక్రమం తీర్థ ప్రసాద వినియోగం, 8-00గం"కు రాజాధిరాజా వాహనంపై గ్రామోత్సవం జరుగుతుందని ప్రతి ఒక్కరూ దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందాయని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఆయనతో పాటు ఆలయ కార్యనిర్వహణాధికారి చెన్నకేశవరావు పాల్గొన్నారు.

డిఎంహెచ్ఓ డాక్టర్ రవికి ఆర్ఎంపీ వైద్యుల సంఘం సన్మానం

విశాలాంధ్ర - నకరికల్లు : పల్నాడు జిల్లా డిఎంహెచ్ఓ (వైద్య ఆరోగ్యశాఖ అధికారి)గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బి.రవిని నూతన సంవ త్సరం, సంక్రాంతి పురస్కరించుకొని ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆర్ఎంపి(ఐ) అండ్ పిఎంపీ 213/84 నరసరావుపేట డివిజన్ తరఫున బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ రవి మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీ గ్రామీణ వైద్యులు మెడికల్ షాపులు, రక్త పరీక్ష ల్యాబ్‌లు నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తే ఆర్ఎంపీల వద్ద మం దులు పెద్ద ఎత్తున ఉంటున్నాయని, తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని నిబంధ నలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. సభ్యులకు సూచనలు, సలహాలు అందజేసి పరిధికి మించి వైద్యం చేయకుండా, నిబంధనలు అతిక్రమించకుండా చూసుకోవాల్సిన బాధ్యత అసోసియేషన్ నాయ కులపై ఉందన్నారు. తరచూ వస్తున్నా ఫిర్యాదులపై నిఘా పెట్టామన్నారు. మం దుల నిల్వలు లేకుండా, రక్త పరీక్షా కేంద్రాలు నిర్వహించకుండా ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని లేకుంటే పోలీస్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా సభ్యులు నడుచుకునేలా చూస్తామని, ప్రాథమిక వైద్యంలో పరిమితులకు మించకుండా ఉండేలా చూసుకుంటామని అసోసియేషన్ తరఫున నాయకులు డిఎంహెచ్ఓకి తెలియజేశారు. డిఎంహెచ్ఓని కలిసిన వారిలో డివిజన్ అధ్యక్షుడు షేక్ బాజీ, కార్యదర్శి షేక్ సైదా, ట్రెజరర్ సరికొండ అంజం రాజు, కమ్యూనికేటర్ ఆరేటి నాగేశ్వరరావు, నకరికల్లు నరసరావుపేట పట్టణం, రూరల్, మండలాల అధ్యక్షులు బాపతు చెన్నారెడ్డి, సాధినేని వీరాంజనేయులు, ఎస్.రాజు, నాయకులు ఉప్పలపాటి వెంకట్రావు, రవి, నాగరాజు ఉన్నారు.

అలరించిన రంగవల్లుల పోటీలు

విశాలాంధ్ర - గుడివాడ : షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఫ్రెండ్స్ ప్రోగ్రెసివ్ ఫ్రెండ్ ఆధ్వర్యంలో ధూళిపాళ్ళ శేషగిరి జ్ఞాపకార్థం కొడాలి విజయభారతి స్మారక రంగవల్లులు పోటీలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లైన్స్ క్లబ్ సంఘమిత్ర అధ్యక్షురాలు ఉప్పలపాటి ఝాన్సీలక్ష్మి విశిష్ట అతిథిగా వాసవి క్లబ్ వనిత వెధర్వపురి అధ్యక్షురాలు చలువాది లక్ష్మీసురేఖ పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంప్రదాయాల పరిరక్షణకు రంగవల్లుల పోటీలు ఎంతగానో తోడ్పడతాయన్నారు కనుమరుగవుతున్న పండుగలు ఆచార వ్యవహారాలు భావితరాలకు తెలియ చెప్పేందుకు వీటిని ప్రతి ఏట నిర్వహించ వలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు మాంటిసోరి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ గాంధీ మున్సిపల్ హై స్కూల్ తదితర పాఠశాలలకు చెందిన 20.మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు ఈ కార్యక్రమంలో ఫ్రంట్ కన్వీనర్ డిఆర్‌కె ప్రసాద్, వాసవి క్లబ్ సభ్యులు గాదె మోహన్‌బాబు, గ్రంథాలయ అధికారి బేరం వెంకటరమణ, గుడివాడ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి మామిళ్ళపల్లి లక్ష్మీనారాయణరెడ్డి, కోశాధికారి చలవాది మోహన్‌రావు లైన్స్‌క్లబ్ గుడివాడ అధ్యక్షులు ఉప్పలపాటి సతీష్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో సరుకుల పంపిణీ

విశాలాంధ్ర - చల్లపల్లి : అవనిగడ్డ మండలం అశ్వారావుపాలెం సచివాలయ కార్యదర్శి దీవి పద్మావతి - మాదివాడ రాము దంపతులు స్థానిక సీయోను వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు వితరణగా అందచేశారు. వృద్ధులకు రోజువారీ అల్పాహారం, భోజనం తయారుచేసేందుకు వీలుగా బియ్యం, కూరగాయలు, సరుకులను ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చల్లపల్లి సబ్ బ్రాంచ్ చైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

విశాలాంధ్ర - చల్లపల్లి : తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పిస్తోందని చల్లపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు అన్నారు. బుధవారం స్థానిక ఇస్లాం నగర్ లోటీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. సామాన్య ప్రజలు సైతం స్వచ్ఛందంగా టీడీపీ సభ్యత్వం తీసుకుంటున్నారని అన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ప్రమాద భీమా చేయించటం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ నబీఘోరి, వార్డుసభ్యుడు షేక్ సిలార్, కారంకి సతీష్, కారంకి ఫణికుమార్, అష్ఫక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు మౌలిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర-దాచేపల్లి : కృష్ణానది తీరానున్న కాట్రపాడులో ఉన్న గోశాలకు తగిన మౌలిక వసతులు కల్పించాలని నిర్వాహకుడు పసుపులేటి పిచ్చయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వందలాది ఆవులకు ఆశ్రయం కల్పిస్తున్న తన పితా మాతా ఆశ్రమంతో పాటు గోశాలకు 2021లో అప్పటి అధికారులు కాట్రపాడులో మూడెకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. అయితే దాన్ని ఇప్పటివరకు ఆన్‌లైన్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యుత్, తాగునీటి వసతి కల్పించాలని ఆయన కోరారు.